ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..


'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | గురువారం | 04.09.2025 | సంపుటి : 1 | సంచిక :72 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్

# హరీష్ రావు బబుల్ షూటర్

## బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు

## రేపు కెటిఆర్‌కు కూడా ఇలాంటి గతే పడుతుంది

- నన్ను బయటకు పంపేందుకు ఎప్పటినుంచో ప్లాన్‌లు
- కెసిఆర్ ఇది గుర్తించి ముందుకు సాగాలి
- గుంటనక్కలు హరీష్, సంతోష్‌ల పట్ల జాగ్రత్త
- రేవంత్‌తో కుమ్మక్కయిన హరీష్ రీవు
- మీడియా సమావేశంలో కవిత సంచలన వ్యాఖ్యలు



బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్కల్లా చుట్టూ చేరిన హరీష్ రావు, సంతోష్ రావులతో జాగ్రత్త అంటూ కెసిఆర్ తనయ కవిత హెచ్చరించారు. అధికారంలో ఉండగా అడ్డగోలుగా సంపాదించుకున్న వీరు ఇప్పుడు మీకు కూడా ఎసరు పెట్టే పనిలో ఉన్నారు..తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అన్నా రామన్నా నీవు కూడా వరితో జాగ్రత్త అంటూ హెచ్చరికలు చేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపడానికి కారణమైన వీరు మన కుటుంబం విచ్ఛిన్నం కావాలని పన్నాగం పన్నారని అన్నారు.

హైదరాబాద్,సెప్టెంబర్3 : బిఆర్ఎస్‌లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడుతూ.. భారత

- మిగతా 3వ పేజీలో

## పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా

### సస్పెండ్ చేయడంతో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్3: తను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన కారణంగా బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్ తనపై సస్పెన్షన్ వేటు వేయడంతో.. తన నిజాయితీని నిరూపించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కవిత మాట్లాడారు.

- మిగతా 3వ పేజీలో

## సంతోష్‌కు ధనదాహం ఎక్కువే

### పోచంపల్లి శ్రీనివాసరెడ్డితో వెంచర్లు

హైదరాబాద్,సెప్టెంబర్3: తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ, కేసీఆర్ మరో బంధువు అయిన జోగినపల్లి సంతోష్ కుమార్ మీద కూడా కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు గుప్పించారు. సంతోష్ రావు దన దాహానికి అడ్డుఅదుపు లేదు. సిరిసిల్ల ఇసుక లారీ కేసులో దళితులను టార్చర్ చేసింది సంతోష్.. చెడ్డ పేరు మాత్రం కేటీఆర్‌కు ఇచ్చారు. ముందులో మంచింగ్ చేయడానికి ఒకడు ఉండాలి వీడు వాడే అంటూ విమర్శలు గుప్పించారు. సంతోష్‌కు ఎమ్మెల్యే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడు. ఇప్పుడు షాట్. ఇది నాకు చెప్పింది పల్లా రాజేశ్వర్ రెడ్డి.

- మిగతా 3వ పేజీలో



03

## కేసీఆర్ వదిలిన బాణం కవిత

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



04

## భగ్గుమంటున్న బంగారం ధరలు

లక్షా పదివేల దిశగా పరుగులు

## 6న హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం

### హాజరవుతున్న హోంమంత్రి అమిత్ షా





హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న కేంద్ర హోంశాఖమం త్రి అమిత్ షా రానున్నారు. మోజంజాహి మార్కెట్ వద్ద గణేశ్ విగ్రహాలకు స్వాగతం పలికి ప్రసంగిస్తారు. ఆరోజు మధ్యాహ్నం 1:10కి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో భేటీ కానున్నారు.

04




## విదేశాల నుంచి ఆగిన యూరియా దిగుమతులు

- కొరత అందుకేనని వెల్లడించిన కేంద్రం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

02



యుద్ధాల కారణంగా కేంద్రం ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోలేదని, అందువల్లనే కొరత ఏర్పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నుల్లో 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారు. ప్రతి నెలలో పంపిణీ చేయాల్సిన యూరియాలో కోత పెట్టారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నులు సరఫరా చేయలేదు.



## ప్రియుడి మోజులో భర్త హత్య

- తరవాత కూతురును కడతేర్చిన రాకాసి
- పోలీసుల విచారణతో గట్టురట్టు

04


## ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు

### కాంగ్రెస్ అంటేనే పేదలపక్షం

- బాధ్యతను నెరవేరుస్తున్న పొంగులేటి
- బిఆర్ఎస్ సచ్చిన పాము.. దానిని మళ్లీమళ్లీ చంపడమెందుకు
- లక్షకోట్లను పంచుకోవడంలో కెసిఆర్ కుటుంబంలో కలహాలు
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంలో సిఎం రేవంత్ రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్3 : హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా.. ధరణి భూతం నుంచి రైతులకు విముక్తి కల్పించాలన్నా సమర్థుడైన మంత్రి కావాలని భావించా. అందుకే, పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గృహనిర్మాణ, రెవెన్యూ శాఖలు అప్పగించా. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి విజయవంతం చేశారని అన్నారు. భద్రాద్రి

- మిగతా 2వ పేజీలో



## హరీష్ రావు, రేవంత్ కుమ్మక్కు నిజమే

రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు కుమ్మక్కయ్యారని తాను గతంలోనే చెప్పానని భాజపా ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కవిత కూడా ఇప్పుడు అదే విషయంచెబుతోందని అన్నారు. ఆమె ఇప్పుడు మీడియాతో కొత్తగా చెప్పింది ఏం లేదని పేర్కొన్నారు. వాళ్ల పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడదల్చుకోలేదని తెలిపారు. కవిత చెప్పిన మోకిల ప్రాజెక్టు అవకతవకల గురించి విచారించాలని చెప్పారు.



- గతంలోనే తాను ఈ విషయం చెప్పా
- ఇప్పుడు కవిత కొత్తగా చెప్పిందేమీ లేదు
- పోచంపల్లి, నవీన్‌రావు అక్రమాలపై విచారణ జరపాలి
- మీడియాతో ఎంపి రఘునందన్ రావు డిమాండ్

హైదరాబాద్,సెప్టెంబర్3: పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాలపై విచారణ జరపాలన్నారు. జడ్పీ అధ్యక్షుడిగా నన్ను ఎవరు ఓడించారో గతంలో కేసీఆర్‌కు చెప్పాను. ఆరోజు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఇబ్బందిపెట్టాలని చూసినట్లు గతంలోనే చెప్పా. కవిత ఇంకా వేరే విషయాలు కూడా మాట్లాడితే బాగుండేది.

- మిగతా 3వ పేజీలో



# విదేశాల నుంచి ఆగిన యూరియా దిగుమతులు

- కొరత అందుకేనని వెల్లడించిన కేంద్రం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 :** యుద్ధాల కారణంగా కేంద్రం ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోలేదని, అందువల్లనే కొరత ఏర్పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నుల్లో 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారు. ప్రతి నెలలో పంపిణీ చేయాల్సిన యూరియాలో కోత పెట్టారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నులు సరఫరా చేయలేదు. ఇతర దేశాల నుంచి వస్తోన్న యూరియానే సరఫరా చేస్తున్నారు. రామగుండం పరిశ్రమ నుంచి కూడా ఒక్క బస్తా ఇవ్వలేదు. కొరత కారణంగా రాష్ట్ర రైతులు ఆందోళనలో ఉన్నారు. అన్ని పంటలకు సెప్టెంబర్‌లో యూరియా చివరి కోటా వేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల భారీ వర్షాల వల్ల ఆరేడు జిల్లాల్లో అన్ని శాఖల్లో తీవ్ర నష్టం సంభవించింది. రాష్ట్రంలో పంటలు, రోడ్లు, మౌలిక సౌకర్యాలు దెబ్బతిన్నాయి. చేనేత రంగంపై పన్నులు ఉండకూడదని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ఆయిల్‌పామ్ దిగుమతిపై సుంకాలు 40 శాతానికి పెంచాలని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారత రాష్ట్ర సమితి నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారంతో తమకు సంబంధం లేని వ్యవహారం అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాళేశ్వరం వ్యవహారాన్ని సీబీఐ విచారణకు ఇచ్చినట్లు- తెలిపారు. ఏది ఉన్నా.. వాళ్లే చూసుకుంటారన్నారు. ఇదిలావుంటే ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 25000 కనీస మద్ధతు ధర కల్పించేలా ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని మంత్రి విజ్ఞప్తి.చేశారు. తెలంగాణలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడం జిల్లాలను ప్రధాన్ మంత్రీ ధన్-ధాన్య కృషి యోజన పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ యంత్రాలపై, మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ఉన్న 12 శాతం జీఎస్టీని మినహాంచాలని విజ్ఞప్తి చేశారు. పాస్పరస్, పొటాషియం, సల్ఫర్ వంటి పోషకాలపై సబ్సిడీ పెంచి యూరియాతో సమానంగా ధరలో సమతుల్యత తీసుకురావాలని మంత్రి తుమ్మల కోరారు.

# అవినీతిలో కవితకు భాగస్వామ్యం లేదంటే ఎలా?

**ఆమె మాటలు నమ్మదగ్గవిగా లేవు : మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** పదేళ్ల పాటు- బీఆర్ఎస్ పాలనలో కీలక స్థానంలో ఉన్న కవితకు అవినీతి వ్యవహారాల్లో భాగస్వామ్యం లేకుండా అవి జరిగాయని అనటం అసాధ్య మని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రజల సొమ్ము దోచుకున్న తర్వాత, వాటాలో తేడా రావడంతోనే కవిత బహిరంగ వేదికపైకి వచ్చారని వ్యాఖ్యానించారు. కవిత రాజీనామాపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కవిత కొన్ని కఠోర సత్యాలు, కొన్ని అబద్ధాలు మాత్రమే మాట్లాడారని ఆయన అన్నారు. కవిత నిజంగా అవినీతి విషయాల్లో ఆధారాలు ఇస్తే వాటిని పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా లిక్కర్ మార్ట్ కేసు, ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రిపై ఎత్తేసిన కేసు వంటి అంశాలపై సరైన వివరాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందని హామీ ఇచ్చారు. కేసీఆర్‌పై స్పై చేయాల్సిన అవసరం లేదన్నారు. స్పై చేయడం మాకు అలవాటు- కాదు.. ఫోన్ ట్యాప్‌లు మీరు చేశారు. మీరు మీలో మీరే గొడవ పడి బయటపడుతున్నారని అంటూ బీఆర్ఎస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. ఆయన కవిత ఇటీవలే అమెరికా నుండి తిరిగివచ్చిన తర్వాత హరీష్ రావు, సంతోష్‌పై ఆరోపణలు చేయడం, అంతకు ముందు కేటీ-ఆర్‌పై విమర్శలు చేయడం బీఆర్ఎస్ లోపల విభేదాలను బహిర్గతం చేస్తోందని అన్నారు. ఇదిలావుంటే కవిత రాజీనామా చేయడాన్ని మహేష్ గౌడ్ స్వాగతించారు. నైతికతకు కట్టుబడి ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయడం శుభపరిణామమని అన్నారు. కవిత కేసీఆర్ వదిలిన బాణం మాత్రమే. ప్రజల దృష్టిని డైవర్ట్ చేయడానికి ఇవన్నీ చేస్తున్నారు. అయితే నైతికతతో తీసుకున్న ఈ నిర్ణయం సానుకూలమే అని వ్యాఖ్యానించారు. అంతేకాక, రాబోయే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ అనే పార్టీ రాజకీయ ముఖచిత్రంలో ఉండదని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

### భారత్‌లో ఆశ్రయం పొందుతున్న

# హిందువులకు ఊరట

**పాస్‌పోర్టు లేకున్నా ముస్లిమేతర శరణార్థులకు ఆశ్రయం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 :** పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి వచ్చి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మైనార్టీలకు కేంద్రం ఊరట కల్పించింది. వివిధ రకాల కారణాలతో డిసెంబరు 31, 2024 తేదీ లోపు భారత్‌కు వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద పాస్‌పోర్టు, ఇతర పత్రాలు లేకపోయినా వారు భారత్‌లో ఉండేందుకు అనుమతిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ఆయా దేశాల నుంచి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు భారత పౌరసత్వం కల్పిస్తామని పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ప్రకారం.. 2014 డిసెంబరు 31 కంటే ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు మాత్రమే భారత పౌరసత్వం కల్పించనున్నట్లు- కేంద్రం వెల్లడించింది. తాజాగా ఈ పౌరసత్వ నిబంధనలకు సడలింపులు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) 2025లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటు- న్నట్లు- కేంద్ర హోంశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. 'అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో మతపరమైన హింసల కారణంగా భయంతో డిసెంబరు 31, 2024 తేదీలోపు భారత్‌ను ఆశ్రయించిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం ఇవ్వడానికి కేంద్రం చర్యలు తీసుకుంటు-ంది. చెల్లుబాటు- అయ్యే గుర్తింపు పత్రాలు లేకపోయినా భారత్‌లో నివసించవచ్చు. ఇకపై వారికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోతాయి. దశాబ్దాలతరబడి కాందిశీకుల్లా బతుకుతున్న వారికి గౌరవప్రదమైన జీవితం లభిస్తుంది. దేశంలో ఎక్కడి-కైనా వారు రాకపోకలు సాగించొచ్చు. ఆస్తులు కొనవచ్చని హోంశాఖ వెల్లడించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం మన పౌరసత్వాన్ని ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గతేడాది పౌరసత్వ సవరణ చట్టం-2019 ని అమల్లోకి తెచ్చింది. సీఏఏ (ఈష|ఃురూ ఆప|ప|ష ఆ-ష)-2019 చట్టం ప్రకారం.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం భారత పౌరసత్వాన్ని ఇచ్చేలా కేంద్రం నిబంధనల్ని రూపొందించింది.

# పాలమూరును ఎండబెట్టిన కేసీఆర్

- ఎంపిగా గెలిపించినా పట్టించుకోని నేత
- తెలంగాణ వస్తే అభివృద్ధి జరుగుతుందని మోసపోయాం
- గ్రీన్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులకు నిధులు మంజూరు
- మూసాపేట కార్నింగ్ కంపెనీలో రెండో యూనిట్ ప్రారంభం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం రేవంత్ పిలుపు



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 :** ఒకప్పుడు పాలమూరు వలసల జిల్లాగా ఉండేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎక్కడ తట్టు పని, పార పని ఉన్నా, పాలమూరు జిల్లా వారే కూలీలని తెలిపారు. అందుకు ప్రధాన కారణం మనం చదువులో వెనుకబడి ఉండటమేనని అన్నారు. స్వరాష్ట్రం వస్తే అభివృద్ధి జరుగుతుందని భావించామని, కానీ తెలంగాణ వచ్చాక కూడా అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసాపేట మండలం వేములలో కార్నింగ్ కంపెనీలో రెండో యూనిట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అప్పట్లో పాలమూరు విశ్వవిద్యాలయం కేవలం ఓ పీజీ కాలేజీలా ఉండిపోయిందని, ఇప్పుడు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం వచ్చిందని అన్నారు. ఇకపై విద్య, ఉపాధి, అవకాశాలను జిల్లా అందిపుచ్చుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ ఎస్సీ, ఎస్టీలకు భూములు అప్పట్లో అప్పగించిందని గుర్తు చేశారు. ఇప్పుడు చదువుకుంటేనే తలరాత మారుతుందని, చదువు కోసం కావాల్సిన వసతులు కల్పించటం తన బాధ్యత అని భరోసా ఇచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా జిల్లా ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పాలమూరు జిల్లా ఒకనాడు వలసలకు మారుపేరు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో పర్యటించిన సీఎం, అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... "పాలమూరు బిడ్డల భాగస్వామ్యం లేకుండా ఏ ప్రాజెక్టు నిర్మాణం జరగలేదు. చదువు, నీళ్లు జిల్లా ప్రజలకు అందుబాటులో లేక వలసలు వెళ్లాల్సి వచ్చింది. కృష్ణా నది పక్కగా ఉన్నా తాగు, సాగునీటి సమస్యలు ఉన్నాయి. కానీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ప్రయత్నం చేయలేదు" అని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాలమూరు జిల్లా అండగా నిలిచిందని, కేసీఆర్‌ను మహబూబ్‌నగర్ ఎంపిగా గెలిపించామని అన్నారు. అయితే, ఎంపిగా గెలిపించినా తమ ప్రాంతానికి సముచిత న్యాయం జరగలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో పలు ప్రాజెక్టులు పూర్తి కాలేదని అన్నారు. పేరుకే పాలమూరు వర్సిటీ.. కానీ ఇప్పటికీ పీజీ కాలేజీగానే మిగిలిపోయిందని వ్యాఖ్యానించారు. చదువు, ఉపాధి, నీటిపారుదల రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రణాళికలు రచించకపోతే శాశ్వతంగా అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాకు ట్రిపుల్ ఐటీ మంజూరు చేశామని, 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'యంగ్ ఇండియా స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామనిలిలి తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం జిల్లా వేదికగా మారబోతుందని వెల్లడించారు.

**కొడంగల్ పరిస్థితి వేరు.. నారాయణపేట వేరు**

కొడంగల్, నారాయణపేటకు ఎత్తిపోతల పథకం తీసుకెళ్తే.. అక్కడి రైతులు భూసేకరణకు 20 లక్షలు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. కొడంగల్ పరిస్థితి వేరు, నారాయణపేట వేరు అని స్పష్టం చేశారు. నారాయణపేట వారికి కావాలంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. భూసేకరణ కోసం లిలిమంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు ఈ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. మీడియా కూడా లేనిపోని వార్తలకు, అపోహలకు తావు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైల్ ఉత్పత్తి కోసం యత్నిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల కోసం స్థలాలు చూపించాలన్నారు. గతంలో పాలకులు మన పేదరికాన్ని చూపించేందుకు టోనీ బ్లెయిర్‌ను తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మన అభివృద్ధిని, ప్రాజెక్టులను, విద్యా సంస్థలను చూపించేందుకు విదేశీ నాయకులను పిలవాలని అన్నారు. "కుర్చీలో కూర్చున్న ప్రతి నాయకుడు, ఆయనను నమ్ముకున్న ప్రజలకు మొదటి ముద్దను పెట్టాలి" అని పేర్కొన్నారు. తనకు ఏ అవకాశం వచ్చినా, మొదటి ముద్ద పాలమూరుకు పెడతానని ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ ఉండకూడదని చూసిన వారు, ఇప్పుడు వాళ్లే కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు" అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. "తాను హరీష్‌రావు, సంతోష్‌రావు వెనకాల ఉన్నానని ఒకరు, కవిత వెనక ఉన్నానని మరొకరు అంటున్నారు. కానీ తాను ప్రజల అభివృద్ధి కోసం ముందు ఉంటానని స్పష్టం చేశారు." ఈ సమావేశంలో సీఎం వెంట మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు

- కాంగ్రెస్ అంటేనే పేదల పక్షం
- ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతను నెరవేర్చుతున్న పొంగులేటి
- పదేళ్లుగా లేని రేషన్ కార్డులు ఇచ్చాం
- పేదలందరికి సన్నబియ్యం సురఫరా
- బీఆర్ఎస్ సచ్చిన పాము... దానిని మళ్లీ మళ్లీ చంపడమెందుకు?
- లక్షకోట్లను పంచుకోవడంలో కేసీఆర్ కుటుంబంలో కలహాలు
- కత్తులతో ఒకరినొకరు పొడుచుకుంటున్నారు
- వారి పంచాయితీలో తలదూర్చే సమయం మాకెక్కడిది
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంలో సీఎం రేవంత్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 3 :** హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ, ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదలందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా, ధరణి భూతం నుంచి రైతులకు విముక్తి కల్పించాలన్నా సమర్థుడైన మంత్రి అవసరమని భావించాను. అందుకే పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గృహనిర్మాణ, రెవెన్యూ శాఖలు అప్పగించాను. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి విజయవంతం చేశారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాటు చేసిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం దామరచర్లలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తామని గతంలో వైఎస్ఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్యలో 22 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్లలోకి పేదలు ప్రవేశించినప్పుడు వచ్చే ఆనందం వెలకట్టలేనిదని చెప్పారు. పేదల కష్టాలు మాకు తెలుసు కాబట్టే... పేదరికాన్ని రూపుమాపాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్ర ప్రజలకు పదేళ్లపాటు కొత్త రేషన్ కార్డులు అంటే ఏమిటో తెలియదు. మా ప్రభుత్వం వచ్చాక లక్షలాది రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చాం. మేము ఏ బియ్యం తింటామో, పేదలకూ అదే సన్నబియ్యం ఇస్తున్నాం అని రేవంత్ రెడ్డి తెలిపారు.

**బీఆర్ఎస్ కోరలు ప్రజలు ఎప్పుడో పీకేశారు**

"బీఆర్ఎస్ విషనాగు. ఈ పాములో కాలకూట విషం ఉంది. కానీ ప్రజలు దాని కోరలు ఎప్పుడో పీకేశారు" అని తీవ్రంగా విమర్శించారు. హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యారంటూ కవిత చేసిన వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. "లక్షకోట్లు దోచుకున్న కుటుంబంలో ఇప్పుడు కలహాలు మొదలయ్యాయి. పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. అక్క, అన్న, చెల్లి, బావ ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారు. దోపిడీ సొమ్ము వాళ్లింట్లో చిచ్చు పెట్టింది. సంపాదించుకున్న టీవీలు, పేపర్ల కోసం కొట్టుకుంటున్నారు. వాళ్లు వాళ్లు కొట్టుకుంటూ మాపై నిందలు వేస్తున్నారు. వారి పంచాయితీల్లో మమ్మల్ని లాగొద్దు. చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేముంది."

బీఆర్ఎస్‌ను ప్రజలే బొందపెట్టారని సీఎం రేవంత్ మండిపడ్డారు. దామరచర్ల బహిరంగ సభలో మాట్లాడుతూ... 'సొంతిల్లు అనేది ప్రతి పేదవాడి జీవిత స్వప్నం. గత పదేళ్లు పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదనిలిలి అన్నారు. "ఏటా రెండు లక్షల ఇళ్లు కట్టినా, పదేళ్లలో 20 లక్షల మందికి ఇళ్లు వచ్చేవి. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టింది." ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తెచ్చిన ధరణికి పాతరేసి, భూభారతి తీసుకువచ్చి రైతుల సమస్యలు పరిష్కరించామని తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. "మన పిల్లలు బర్రెలు, గొర్రెలు కాచుకోవాలని కేసీఆర్ పార్టీ వాళ్లు అంటారు. కానీ వాళ్ల పిల్లలు మాత్రం చదువుకుని రాజ్యం ఏలుతున్నారు, దోచుకుంటున్నారు" అని తీవ్రంగా విమర్శించారు. "టీవీలు, పేపర్లు సంపాదించుకున్నారు. వాటి కోసం కొట్టుకుంటున్నారు. దోపిడీ సొమ్మే ఈ రోజు వాళ్ల మధ్య చిచ్చు పెట్టింది. వాటాల కోసం వాళ్లు ఒకరినొకరు కొట్టుకుంటూ మాపై నిందలు వేస్తున్నారు" అని ఫైర్ అయ్యారు. "బీఆర్ఎస్ పార్టీని ప్రజలే బొంద పెట్టారు. సచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేముంది. వారి కుటుంబ పంచాయితీలో మమ్మల్ని లాగొద్దు" అని హెచ్చరించారు. బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు సీఎం రేవంత్. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. తెలంగాణ తొలి దశ ఉద్యమం ఖమ్మం జిల్లా పాల్వంచలోనే మొదలైందని, ఖమ్మం జిల్లా ప్రజలు తెలంగాణకు దిశ చూపించారని తెలిపారు. "ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడాలనే ఉద్దేశంతో కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిశారు. ఇది ఎన్నికల స్టంట్ కాదు. ప్రజలు ఆలోచించాలి. 'రోటీ, కప్డా, మకాన్' అనే నినాదాన్ని అప్పట్లో ఇందిరమ్మ కొనసాగించగా, ఇప్పుడు అదే నినాదాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది." కొంతమందికి పేదరికం అంటే ఎక్స్‌కర్షన్ మాదిరిగా ఉంటుంది. కానీ మేము పేదవర్గంలో పుట్టి పెరిగాం. వారితో సమానంగా పంచుకున్నాం. పేదలుగా బతకడం మా జీవన విధానం." "పేదరికం తెలిసిన, కుటుంబ సభ్యుల్లా భావించే పార్టీ కాంగ్రెస్." "ఇందిరమ్మను పేద ప్రజల గుండెల్లో అమ్మలా గుడి కట్టుకున్నారు." "పేదలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమం అందలేదు." ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి కలిగిన జిల్లా. అందుకే ఈ జిల్లాలో నుంచి ముగ్గురు మంత్రులను చేశాం. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి. "పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ఉంటే పేద వర్గాల కష్టాలు తీరిపోయేవి" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# నేను ప్రజల వెనకే ఉన్నా

**నేనెవరి వెనకా లేనన్న సిఎం రేవంత్**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 :** భారత రాష్ట్ర సమితి నేతలను ప్రజలు తిరస్కరించారని, అలాంటి వారి వెనుక తాను ఎందుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారి రాజకీయ లబ్ధి కోసం తనను వాడుకుంటానని అంటే ఎలా అని అన్నారు. బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు- చేసిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్‌రావు వెనుకాల రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలపై సీఎం తాజాగా స్పందించారు. నేను కవిత వెనుకున్నానని కొందరు అంటున్నారు. హరీశ్‌రావు, సంతోష్ వెనుక ఉన్నానని మరికొందరు అంటున్నారు. నేను ఎవరి వెనుకా లేను. ఇప్పటికే ప్రజలు వాళ్లను తిరస్కరించారు. అలాంటి వారితో కలిసే సమయం నాకు లేదు. ప్రజల వెంట మాత్రమే ఉంటాను. మీ కుల, కుటుంబ పంచాయితీల మధ్య మమ్మల్ని తీసుకురావొద్దని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒకప్పుడు జనతా పార్టీ చాలా ఫేమస్.. కాల గర్భంలో కలిసిపోయిందని గుర్తు చేశారు. ఏ పార్టీ, ఎవరు శాశ్వతం కాదుని హితవు పలికారు. పాపం ఎప్పుడూ ఊరికే పోదని నొక్కిచెప్పారు.



# నాంపల్లి కోర్టుకు నాగార్జున

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు సినీ నటుడు అక్కినేని నాగార్జున, అక్కినేని నాగ చైతన్య హాజరయ్యారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై న్యాయమూర్తి ఎదుట నాగార్జున, చైతన్య స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం నాగార్జున మీడియాతో మాట్లాడుతూ తాను వేసిన పరువునష్టం దావా కేసులో కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతోందన్నారు.

# కొండపోచమ్మ సాగర్‌కు భారీగా గోదావరి జలాలు

**సిద్దిపేట, సెప్టెంబర్ 3 :** గజ్వేల్ పరిధిలోని మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ జలాశయంలోకి గోదావరి జిల్లాలను ఎత్తిపోసే పక్రియ ప్రారంభమైంది. రంగనాయక సాగర్ జలాశయం నుంచి మల్లన్న సాగర్ జలాశయంలోకి ఎనిమిది పంపుల ద్వారా గోదావరి జలాలను విడుదల చేశారు. మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్ పంప్ హౌస్‌కు మూడు పంపుల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసే పక్రియను ఈ రోజు ప్రారంభించారు. మూడు పంపుల ద్వారా 3,750 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి విడుదల చేస్తున్నట్లు- జలాశయం నిర్వహణ విభాగం ఏఈ సాయికుమార్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 6.85 టీ-ఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు- తెలిపారు

# ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాలి

**జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచన**

**హైదరాబాద్,సెప్టెంబర్ 3 :** బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో కృత్రిమ మేధలో, టూల్స్ టెక్నిక్స్, వర్క్ షాపును తెలంగాణ మీడియా అకాడమి, అదిరా డాటా లీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్‌కు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన దాదాపు 100 మందికి పైగా జర్నలిస్టులు ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమి చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిజం రంగంలో కూడా ఎఐని విరివిగా వాడుతున్నారని అన్నారు. అందులో భాగంగా న్యూస్ రూములు పరివర్తన చెందినందున జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐ ని జర్నలిస్టులు వృత్తిలో భాగంగా ఉపయోగించుకొని రిపోర్టింగ్ లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చు అని ఆయన తెలిపారు. ఎఐ సాంకేతికత పై లోతైన నైపుణ్యం ఉన్న, ఇంటర్నేషనల్ -ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి శిక్షణ నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఏఐ శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మన తెలంగాణలో జర్నలిస్టులకు ఏఐలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటి ప్రయత్నం అని ఆయన అన్నారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థి లాగా ఉండాలన్నారు. అదేవిధంగా తాను కూడా నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని తన వృత్తి జీవితం గురించి వివరించారు. ఏఐ శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఏఐ పద్ధతులు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి విస్తృతంగా వివరించారు. కృత్రిమ మేధ జర్నలిస్టుల వృత్తిలో భాగంగా తప్పనిసరి అయిందని, ఏఐ మనసును భ్రమింప జేసి తప్పుడు సమాచారాన్ని వివక్ష లాంటి సమాచారాన్ని అందించే ప్రమాదం ఉందన్నారు. తన వద్ద ఉన్న ఉదాహరణల ఆధారంగా ఏఐ అవుట్ పుట్ టూల్స్ కూడా జాతి, మత, వర్గ, లింగ భేదాలు కలిగించే కంటెంట్ ను అందిస్తాయన్నారు. ఆటోమేషన్ లో భాగంగా ఏఐ ఏజెంట్స్ వస్తున్నాయని, దీని ద్వారా రాబోయే కాలంలో వివిధ రకాల ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. చాట్ జిపిటి, పెర్ప్లెక్సిటీ-, నోట్ బుక్ ఎల్ ఎం, గూగుల్, జమినయి, మిడ్ జర్నీ, సోరా, విఇఓ3, తదితర టూల్స్ ని పరిచయం చేసి జర్నలిస్టులు ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణల ద్వారా అవగాహన కలిగించారు.

# బీఆర్‌ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు

- రేపు కేటీఆర్‌కూ ఇలాంటి గతే పడుతుంది
- నన్ను బయటకు పంపేందుకు ఎప్పటినుంచో ప్లాన్‌లు
- కేసీఆర్ ఇది గుర్తించి ముందుకు సాగాలి
- గుంటనక్కలు హరీష్, సంతోష్‌ల పట్ల జాగ్రత్త
- సీఎం రేవంత్‌తో కుమ్మక్కయిన హరీష్
- మీడియా సమావేశంలో కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** బీఆర్‌ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్కల్లా చుట్టూ చేరిన హరీష్ రావు, సంతోష్ రావులతో జాగ్రత్త అంటూ కేసీఆర్ తనయ కవిత హెచ్చరించారు. అధికారంలో ఉండగా అడ్డగోలుగా సంపాదించుకున్న వీరు ఇప్పుడు నన్ను కూడా ఎసరు పెట్టే పనిలో ఉన్నారు. తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అన్నా రామన్నా నీవు కూడా వారితో జాగ్రత్త అంటూ హెచ్చరికలు చేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపడానికి కారణమైన వీరు మన కుటుంబం విచ్ఛిన్నం కావాలని పన్నాగం పన్నారని అన్నారు.

బీఆర్‌ఎస్‌లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడుతూ, భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లాభం పొందాలనుకునే వాళ్లు మేము ముగ్గరం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబం బాగుండొద్దు మేము విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా మీరు చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీఆర్)కు, మీకు పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారని కవిత వ్యాఖ్యానించారు.

### ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టా

అక్రమ కేసులు పెట్టి తిహార్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. గురుకులాలు, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ. 2500 ఆర్థిక సాయం అందించాలని పోస్ట్ కార్డ్ ఉద్యమం చేశామని చెప్పారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినప్పుడు గళమెత్తినట్లు చెప్పారు. బనకచర్ల, భద్రాచలం సబ్జారులోని ముంపు గ్రామాల అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు కవిత తెలిపారు. సీఎం సొంత జిల్లాలో భూ నిర్వాసితులకు అండగా ఉన్నామని చెప్పారు. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలుపుకొని గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడామన్నారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీల అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు చిలువలు పలువలుగా ప్రచారం చేశారని విమర్శించారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెప్పానన్నారు. దానిలో తప్పేముంది? నా తండ్రి కేసీఆర్ చిటికెన వేళ్ల పట్టుకుని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. చెప్పింది చెప్పినట్లు ఆయన చేశారు. ప్రతి కులాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. అది సామాజిక తెలంగాణ కాదా? నేనేమైనా తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ భారత రాష్ట్ర సమితికి అవసరం లేదా? భౌగోళిక తెలంగాణ వస్తే సరిపోతుందా? బంగారు తెలంగాణ అంటే హరీష్ రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే అవుతుందా? సమాజంలో ప్రతి ఒక్కరూ బాగుంటేనే బంగారు తెలంగాణ అవుతుందని ఆమె మీడియా ముందుంచారు.



## సీఎం రేవంత్‌కి హరీష్‌రావు ఎప్పుడో లొంగిపోయారు

తనపై ఎలా కుట్రలు సాగించారో సోదాహరణంగా వివరించారు. "నేను రామన్నను గడ్డం పట్టుకొని బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేయరా అన్నా? నేను కూర్చొని ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా? నాకైతే అనుమానమే" అని అన్నారు. హరీష్‌రావు, సంతోష్ గురించి ఆలోచించాలని కేసీఆర్‌కు బిడ్డగా చెబుతున్నానన్నారు. తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచి హరీష్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీష్‌రావు ఎప్పుడో లొంగిపోయారు. "ఆయన్ను గమనించుకో రామన్న" అంటూ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, హరీష్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారా? లేదా? చెప్పాలి. సంతోష్, హరీష్‌రావు గ్యాంగ్‌లు భారత రాష్ట్ర సమితికి పట్టిన జలగలని కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. కాళేశ్వరంలో అవినీతికి హరీష్ రావే కారణమన్నారు. తుమ్మడిహట్టి నుంచి మార్చిందే హరీష్ రావని చెప్పారు. హరీష్ రావుపై వచ్చిన పాల సరఫరా, ఫామ్ హౌస్ ఆరోపణలు మరుసటి రోజే మాయమయ్యాయని అన్నారు. "ఆయన ట్రబుల్ షూటర్ ట్రబుల్ క్రియేటర్" అని ఘాటు విమర్శలు చేశారు. మెగా కాంట్రాక్టర్‌తో పోచంపల్లి మోకిల్లాలో 750 కోట్ల విల్లా ప్రాజెక్టులు చేపట్టారని అన్నారు. ఇవన్నీ గుర్తించి, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఈ ఇద్దరిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పార్టీకి కూడా ఇదో హెచ్చరిక అన్నారు.

## పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా

**సస్పెండ్ చేయడంతో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** తను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన కారణంగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్ తనపై సస్పెన్షన్ వేటు–వేయడంతో.. తన నిజాయితీని నిరూపించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు–చేసిన విలేకర్ల సమావేశంలో కవిత మాట్లాడారు. తన ఆత్మాభిమానం కాపాడుకునేందుకు తాను ఈ పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తాను చేసిన వ్యాఖ్యల వల్ల ఏదో జరిగిపోయినట్లు– దుష్టచతుష్టయం ఏదో ప్రచారం చేస్తుందంటూ కవిత మండిపడ్డారు. తన విషయంలో రెండు గ్యాంగులు జరగనిది జరిగినట్లుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ వద్దకు వెళ్లితే.. తనను గన్‌మెన్లు అడ్డుకున్నట్లు రాయించారన్నారు. ఆరడుగు ల బుల్లెట్ ఈ రోజు తనను గాయపరిచిందన్నారు. సంతోష్ రావు.. చేసిన పనులతో కేటీఆర్‌కు చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్, సంతోష్ మూతాలు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కుమ్మక్కయ్యాయన్నారు. హరీష్ రావును పక్కన పెట్టుకుని.. నిజాలు మాట్లాడిన తనను బయటకు పంపాం టూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## సంతోష్‌కు ధనదాహం ఎక్కువే

**పోచంపల్లి శ్రీనివాసరెడ్డితో వెంచర్లు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ, కేసీఆర్ మరో బంధువు అయిన జోగినపల్లి సంతోష్ కుమార్ మీద కూడా కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు గుప్పిం చారు. సంతోష్ రావు దన దాహానికి అడ్డుఅదుపు లేదు. సిరిసిల్ల ఇసుక లారీ కేసులో దళితులను టార్చర్ చేసింది సంతోష్.. చెడ్డ పేరు మాత్రం కేటీఆర్‌కు ఇచ్చారు. ముందులో మంచింగ్ చేయడానికి ఒకడు ఉండాలి వీడు వాడే అంటూ విమర్శలు గుప్పించారు. సంతోష్‌కు ఎమ్మెల్యే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడు. ఇప్పుడు షాట్. ఇది నాకు చెప్పింది పల్లా రాజేశ్వర్ రెడ్డి. 750 కోట్ల విల్లా ప్రాజెక్టు నిర్మాణంలో వీరిద్దరి దోస్తానా ఉంది. నవీన్ రావు ఎమ్మెల్సీకి పదవి ఎలా వచ్చింది.. సంతోష్ వల్లనే అని నవీన్ స్వయంగా చెప్పుకున్నాడు. హరీష్ రావు , సంతోష్ రావులు తలో వర్గం మేంటేయిన్ చేస్తూ కాంగ్రెస్ , బీజేపీలతో కుమ్మక్కు అయి బిఆర్ఎస్ ఓడిపోయేలా చేశారు. చివరకు కెసిఆర్ కామారెడ్డిలో ఓడిపోయేలా చేశారు. హరీష్ రావు మీడియాను మేనేజ్ చేస్తే, రాం అన్న యూట్యూబ్ ను మేనేజ్ చేస్తారు. రాం అన్నకు చెప్తున్న.. నువ్వు కూడా హరీష్ రావు లాగా నేర్చుకో. కూతురిగా చెప్తున్న వీళ్ళను పార్టీలో ఉంచుకుంటే వీళ్లు మిమ్మల్ని కూడా మింగేస్తారు. వీరు ఇద్దరు మేక వన్నె పులులు అంటూ కెసిఆర్‌ను కవిత హెచ్చరించారు.

# హరీష్ రావు బబుల్ షూటర్

**సమస్యను సృష్టించి సాల్వ్ చేసానని చెప్తాడు : కవిత**

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆమె మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో సంచలన కామెంట్లు చేశారు. హరీష్ రావు, సంతోష్ రావులపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. పార్టీని హస్తగతం చేసుకోవాలనే కుట్ర జరుగుతోందని అన్నారు. హరీష్‌రావు ట్రబుల్ షూటర్ కాదని, బబుల్ షూటర్ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తన ప్రాణం పోయినా కేసీఆర్‌కు అన్యాయం జరగనివ్వనని స్పష్టం చేశారు. కవిత వేరే పార్టీలో చేరుతుందంటూ జరుగుతుందన్న ప్రచారంపై కూడా ఆమె క్లారిటీ ఇచ్చారు. తాను ఏ పార్టీలో చేరనని, తనకు ఏ పార్టీతో పనిలేదని స్పష్టం చేశారు. జాగృతి కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడాకే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు. తన 20 ఏళ్ల జీవితాన్ని బీఆర్ఎస్, తెలంగాణ కోసం పనిచేయడానికి వెచ్చించానని, సస్పెన్షన్‌పై మరోసారి ఆలోచించాలని కవిత కోరారు. అయినా తనకు ప్రజలున్నారని, వాళ్ల దగ్గరికే వెళ్తానని చెప్పారు.సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌ను ఓడించేందుకు ప్రత్యర్థులకు హరీష్‌రావు డబ్బు పంపారన్నారు. పోచంపల్లికి మోకిలాలో వందల కోట్ల ప్రాజెక్ట్ వచ్చిందని, హరీష్‌రావు ,సంతోష్ బీఆర్ఎస్‌ను జలగల్లాగా పట్టిపీడిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీతో ఇద్దరూ అంటకాగుతున్నారన్నారు. సంతోష్‌రావు బాధితులు చాలా మంది తనకు ఫోన్ చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తనపై సస్పెన్షన్ వేటు వేయడంపై కల్వకుంట్ల కవిత బుధవారం మీడియా ఎదుట స్పందించారు. కలికాలం, కర్మ సిద్ధాంతమంటూ ఆమె ఈ సందర్భంగా వేదాంతంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో తాను దాదాపు 20 ఏళ్ల పాటు– సేవా చేశానని ఈ సందర్భంగా కవిత గుర్తు చేసుకున్నారు. అయితే తనపై పుకార్లు చేసిన వారు.. చేయించిన





వారు అంతకుఅంత అనుభవిస్తారంటూ శాపనార్థాలు పెట్టారు. తాను కర్మ సిద్దాంతాన్ని నమ్ముతానని స్పష్టం చేశారు. ఏదీ ఏమైనా తన ప్రాణం పోయినా కేసీఆర్‌కు మాత్రం అన్యాయం జరగనివ్వనని ఆమె కుండ బద్దలు కొట్టారు. తనపై ఇన్ని కుట్రలు, ఇన్ని అవమానాలు అవసరమా? అంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను కల్వకుంట్ల కవిత ఈ సందర్భంగా అడిగారు. ఎన్నో జన్మల పుణ్యం ఉంటేనే కేసీఆర్‌కు తాను కుమార్తెగా జన్మించానని చెప్పారు. అలాంటి కేసీఆర్‌ను, ఆయన పార్టీని తాను ఎందుకు ఇబ్బంది పెట్టాలనుకుంటానని ఆమె పేర్కొన్నారు. అయితే కేసీఆర్‌పై ఒత్తిడి పెంచి తద్వారా తనను సస్పెండ్ చేయించారంటూ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్ మీట్‌లో హరీశ్ రావు, సంతోష్ రావుపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టీని అస్తగతం చేసుకోవాలని కుట్రలు చేస్తున్నారని కవిత అన్నారు. మొత్తం వాళ్లే చేశారు నాన్నా.. అంటూ కవిత వారిరువురి మీదా తీవ్ర ఆరోపణలు గుప్పించారు. హరీష్‌రావు

# ఎవరి లాభం కోసం హరీష్‌పై విమర్శలు

- వీరబ్రహ్మం వద్ద సిద్ధయ్యలా పనిచేశాడు
- నిజంగానే ట్రబుల్ షూటర్ అంటూ నిరంజన్ కితాబు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** మాజీ మంత్రి హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు కవిత కౌంటర్ ఇచ్చింది. నిజం మాట్లాడినందుకు ఇలాంటి మూల్యం చెల్లించాల్సి వస్తే... తెలంగాణ ప్రజల కోసం ఇంతకంటే వంద రెట్లు ఎక్కువైనా భరిస్తానని ఆమె ఎక్స్ వేదికగా బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కవితను టార్గెట్ చేస్తూ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కొందరు ఎవరికోసమో హరీష్‌రావును టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రక్షణగా ఉండాల్సిన సమయంలో ప్రత్యర్థులకు ఊతం ఇచ్చేలా మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా సమస్య ఉంటే తేల్చుకోవడానికి పద్ధతులు వేరే ఉన్నాయని సూచించారు. శత్రువులకు బలం చేకూర్చేలా మాట్లాడటంలో ఎజెండా ఏంటో ప్రజలు గమనిస్తున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. కవితకు కష్టం వచ్చినప్పుడు హరీష్‌రావు సహా అందరం బాధపడ్డామని గుర్తు చేశారు. వ్యక్తిగత లాభం కోసం ఆరోపణలు సరికాదని నిరంజన్ రెడ్డి హితవు పలికారు. వీరబ్రహ్మం చరిత్రలో సిద్ధయ్యలా, కేసీఆర్ ఏది చెప్పినా అదే హరీష్‌రావు చేశారు అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి హరీష్‌రావు గొప్ప సంపద, ఆయన ట్రబుల్ షూటర్ అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి వీడియోతో మాట్లాడారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత, సభలో హరీష్‌రావు అధికార పక్షాన్ని అద్భుతంగా చెడుగుడు ఆడించారు. 30 సార్లు ఆటంకం కలిగించినా అన్ని విషయాలను వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం డొల్లతనాన్ని ఎండగట్టారు. ఎవరి ప్రయోజనం నెరవేర్చడానికో, ఎవరికి బలం చేకూర్చడానికో కొంత మంది హరీష్‌రావును టార్గెట్ చేసి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఆశ్చర్యకరంగా ఉంది. ఈ సందర్భంలో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి ఎవరైనా సరే ం తెలంగాణను ప్రేమించే వారు, ప్రత్యేకంగా బీఆర్ఎస్ నేతలు రక్షణ కవచంగా ఉండాల్సిన సందర్భం ఇది. బీఆర్ఎస్‌పై చేస్తున్న కుట్రపూరిత ఆరోపణలకు తావు లేకుండా



చీల్చి చెండాల్సింది పోయి, ఖండించాల్సింది పోయి వారికి ఊతమిచ్చే విధంగా మాట్లాడడం బాధాకరమని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ 2000లో పార్టీ ప్రారంభించినప్పటి నుంచి హరీష్‌రావు ఉన్నారు. ఎదురు చెప్పకుండా, ప్రశ్నించకుండా... వీరబ్రహ్మం చరిత్రలో కేసీఆర్ ఏది చెపితే అది సిద్ధయ్యలా హరీష్‌రావు చేశారు. పార్టీ కలర్ కోసం బేగంబజార్ వెళ్లి రంగులు తీసుకొచ్చింది ఆయనే. జలదృశ్యంలో దిమ్మె కట్టించింది హరీష్‌రావే. అక్కడ్నుంచి ప్రస్థానం మొదలుపెట్టారు. ఈ రోజు శాసనసభలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా క్రమశిక్షణ కలిగిన పార్టీ వం–కర్‌గా పని చేస్తున్నారు. ప్రజల కోసం పని చేశారు హరీష్‌రావు. విరామం లేకుండా పని చేశారు. ఆయన పనితీరును గతంలో ఇప్పుడు మాట్లాడుతున్న వారు కూడా ప్రశంసించారు. ఈ రోజు రివర్స్ గేర్ వేసి ఆయనను తులనాడి మాట్లాడడం మనసు ఎలా ఒప్పుకుంటుందో అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.

## కాళేశ్వరం అవినీతిపై కావాలనే కాలయాపన

- ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు అడగడం లేదు?
- మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, సెప్టెంబర్ 3 :** కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులు వచ్చిన తర్వాత కూడా కాలయాపన చేశారని, ఇప్పుడు మాత్రం సీబీఐకి అప్పగిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మరి ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు అప్పగించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేస్తే ఏమంటూ ప్రశ్నించారు. కాళేశ్వరం నుండి దృష్టి మళ్లించేందుకే కవిత అంశం ముందుకు తెచ్చారని అన్నారు. కాళేశ్వరం, గొర్రెలు, బర్రెలు కుంభకోణాలపై చర్చ జరగాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని తొలుత డిమాండ్ చేసింది తామేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. అయితే తమ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ "జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగా సీబీఐ విచారణ ఎలా చేస్తుంది?" అంటూ సందేహం వ్యక్తం చేశారు. "ఘోష్ కమిషన్ రిపోర్టు బీఆర్ఎస్ చేతిలో పెట్టి, ఇప్పుడు సీబీఐతో విచారణ చేయమంటే ఏంటీ?" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. "దొంగ చేతిలో తాళాలు పెట్టినట్టే ఘోష్ కమిషన్ రిపోర్టును బీఆర్ఎస్‌కు ఇచ్చి, సీఎం రేవంత్ రెడ్డి తప్పు చేశారు" అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అవినీతి జరిగినట్టే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత చెప్పిందని గుర్తు చేశారు. "కేసీఆర్ కుమార్తె రాజీనామా చేస్తే ఏమవుతుంది?", "కవితను సస్పెండ్ చేస్తే ఏమవుతుంది? చేయకపోతే ఏమవుతుంది?" అంటూ సంజయ్ అభిప్రాయప డ్డారు. "పార్టీ అంతర్గత వ్యవహారాన్ని కావాలనే బయటకు తెచ్చారు" అని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిని డైవర్ట్ చేయడానికే కవిత అంశాన్ని తెరపైకి తెచ్చారు అని బండి సంజయ్ విశ్లేషించారు. "కవిత ఎపిసోడ్‌తో తెలంగా ణకు ఏమైనా లాభం ఉందా?" అని ప్రశ్నించారు.



## హరీష్ రావు - రేవంత్ కుమ్మక్కు నిజమే

- గతంలోనే నేను ఈ విషయం చెప్పా
- ఇప్పుడు కవిత కొత్తగా చెప్పింది ఏమీ లేదు
- పోచంపల్లి, నవీన్‌రావు అక్రమాలపై విచారణ జరపాలి
- మీడియాతో ఎంపీ రఘునందన్ రావు డిమాండ్


**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** రేవంత్ రెడ్డి, హరీష్ రావు కుమ్మక్కయ్యారని తాను గతం లోనే చెప్పానని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కవిత కూడా ఇప్పుడు అదే విషయాన్ని చెబుతోందని పేర్కొ న్నారు. ఆమె మీడియా ద్వారా ఇప్పుడు చెప్పింది కొత్తగా ఏమీ లేదని వ్యాఖ్యానించారు. వాళ్ల పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడదల్చుకోలేదని తెలిపా రు. అయితే, కవిత ప్రస్తావిం చిన మోకిలా ప్రాజెక్టు అవకత వకల గురించి మాత్రం విచార ణ జరపాలని అన్నారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రావు చేసిన అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. "జడ్పీ అధ్యక్షుడిగా నన్ను ఎవరు ఓడించారు? ఎవరి కుట్ర వల్ల ఓడిపోయానో నేను అప్పటికే కేసీఆర్ కు చెప్పాను. కానీ ఆ రోజు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెదక్ ఎంపీ ఎన్ని కల్లోనూ నన్ను ఇబ్బంది పెట్టాలని చూశారు" అని రఘునందన్ ఆరోపించారు. "కవిత మరింత ఇతర విషయాల పై మాట్లాడితే బాగుండేది. ఆమె మాటలతో బీఆర్ఎస్ అవినీతి పునాదులు ఏమిటో బయటపడతాయని తేలింది. మళ్లీ వచ్చే ఎపిసోడ్‌లో బీఆర్ఎస్ పెద్దలు చేసిన అవినీతిని కూడా బయటపెడితే బాగుంటుంది" అని అన్నారు. "పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాల గురించి ఇప్పుడు మాట్లాడుతున్న కవిత... అదే సమయంలో వీరు పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నప్పుడు చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాలి" అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... "దుబ్బాకకు మీ కుటుంబం చేసిన అన్యాయం గురించి అనేకసార్లు చెప్పాను. అలాగే హరీష్ రావు వల్లే దుబ్బాకు అన్యాయం జరిగిందని అప్పుడే చెప్పాను" అన్నారు. "బీఆర్ఎస్‌లో నేను ఓడిపోవడానికి గల కారణం ఏమిటో కేసీఆర్‌కు అప్పుడే చెప్పాను. రేవంత్ రెడ్డి, హరీష్ రావు ఒకే విమానంలో ప్రయాణించిన విషయాన్ని కూడా నేను అప్పుడే వెలుగులోకి తీసుకొచ్చాను" అని తెలిపారు. "కవిత చెప్పిన విషయాల్లో కొత్తదనం ఏమీలేదు. మోకిలలో జరుగుతున్న విల్లా ప్రాజెక్టుపై ప్రభుత్వం విచారణ జరిపించాలి" అని డిమాండ్ చేశారు. అలాగే, పోచంపల్లి శ్రీనివా స్‌రెడ్డి, నవీన్‌రావులపై వెంటనే ఏసీబీ డీజీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచిం చారు. "గతంలో నార్సింగి టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సందీప్ రావు చేసిన అరాచ కాలు బయటపెట్టాల్సిన అవసరం ఉంది. సంతోష్ రావు వియ్యంకుడిగా ఉన్న సందీప్ రావు, అతడి సహాయంతో అనేక సెటిల్‌మెంట్‌లు చేశాడు" అని తీవ్ర ఆరోపణలు చేశారు.



## కేసీఆర్ వదిలిన బాణం కవిత

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** కేసీఆర్ కుటుంబ సభ్యులు అవినీతి సొమ్మును పంచుకొని ఇప్పుడు తిట్టుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఆయన స్పందిం చారు. కవిత చెప్పిన విషయాలన్నీ వాస్తవమే నని, రాష్ట్రంలో పదేళ్లపాటు యథేచ్ఛగా దోపిడీ జరిగిందన్నారు. పంపకాల్లో విభేదాలు వచ్చి ఇప్పుడు బయటపడుతున్నారు. వాళ్ల పార్టీ లేకుండా వారే చేసుకుంటున్నారు. కవిత ఇన్ని రోజులు బాణాన్ని కేటీఆర్ మీదకు ఎక్కుపెట్టారు. అకస్మాత్తుగా ఆ బాణాన్ని హరీశ్‌రావు మీదకు తిప్పారు. అమెరికా వెళ్లి వచ్చాక కవిత వైఖరిలో మార్పు కనిపించింది. కవిత.. కేసీఆర్ వదిలిన బాణమని నా సందేహం. కేసీఆర్ కుటుంబంలో ఇది కొత్త నాటకం అని అన్నారు.



జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# అవినీతి కారణంగా బిఆర్ఎస్ అంతర్ధానం!



బిఆర్ఎస్‌లో అవినీతి ఉందని, పాలనను అడ్డంపెట్టుకుని అందరూ బాగా సంపాదించారని కవిత వ్యాఖ్యల వల్ల మరింత స్పష్టం అయ్యింది. హరీష్ రావు, సంతోష్ రావులు బాగా సంపాదించారని కవితే స్వయంగా ఆరోపిస్తున్నారు. వారే మీడియాను ఆడిస్తున్నారని కూడా చెప్పారు. కెసిఆర్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే వారి లక్ష్యం అని కూడా ఆమె చెప్పారు. మొత్తంగా ఇదంతా బిఆర్ఎస్‌లో అంతర్గత సమస్యలకు కారణంగా చూడాలి. అన్నింటికీ మించి కెసిఆర్ కేవలం ఫామ్‌హౌజ్‌కే పరిమితంకావడం, అధికారం పోగానే ప్రజల్లోకి రాకపోవడం వల్ల పార్టీ పతనానికి చేరిందని చెప్పాలి. అధికారం ఉండగా అవినీతిలో మునిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాలరాశారు. అధికారం, డబ్బుతో విర్రవీగారు. తాను అచేతనంగా మారడంతో సమస్యలు వస్తున్నాయని ఇప్పుడు కెసిఆర్ గుర్తించడం లేదు. తాను కట్టిన కాళేశ్వరం సకల సమస్యలకు సమాధానమని చెప్పిన నేత, దానిని ఎదుర్కొనేందుకు ముందుకు రాలేదు. అసెంబ్లీకి ముఖం చాటేశారు. ఇదంతా కేవంల ఏడాదిన్నరలో పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే దశకు చేరుకోవడానికి కేవలం కెసిఆర్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. నాయకుడు అన్న వాడు ఎప్పుడూ ఉత్సాహంగా ముందుకు సాగాలి. అవినీతిని ఎదుర్కోవాలి. అధికారం ఉంటే అనుభవించచమే కాదు...అవమానాలు వచ్చినా ధైర్యంగా నిలబడాలి. అప్పుడే నేతగా ప్రజలు గుర్తిస్తారు. కవిత వ్యవహారంతోఇప్పుడు బిఆర్ఎస్ అవినీతి పతాక స్థాయిలో కనిపిస్తోంది. అనేక పథకాల ద్వారా పార్టీలో ఉన్నవారు ఎంతగా సంపాదించారో ప్రజలకు అర్థం అయ్యింది. ప్రాంతీయ పార్టీలు అన్నీ తట్టుకుని నిలబడగలగాలంటే నేత అన్నవాడు గట్టిగా ఉండాలి. కానీ కెసిఆర్ తనకు నచ్చిన విధంగా ఉంటూ వచ్చాడు. అధికారం ఉన్నప్పుడు నడిచింది. కానీ ఇప్పుడు నడవదు. అందుకే బిఆర్ఎస్ మనుగడ అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా మూడు దశాబ్దాల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు ఇంకా అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తనను జైలులో వేసినా గట్టిగా నిలబడి కొట్లాడాడు. పార్టీలో కార్యకర్తలకు, నేతలకు ధైర్యం ఇచ్చాడు. తరిగి పార్టీని అధికారంలోకి తీసుకుని వచ్చే వరకు విశ్రమించలేదు. ఇది చంద్రబాబు పట్టుదలకు తార్కాణంగా చూడాలి.

చంద్రబాబుతో పోలిస్తే వయసులో చిన్నవాడైనా కెసిఆర్ అంతగా ఏనాడూ నిలబడలేకపోయారు. ఇకపోతే ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాయన్నది ప్రధానం కాదు. అవసరార్థం అది కామన్‌గా జరుగుతూనే ఉంటుంది. కాదనుకుంటే వదిలేస్తుంటారు. చంద్రబాబులాగా కరుణానిధి, మమతా బెనర్జీ, జయలలిత కూడా బీజేపీతో నూ కాంగ్రెస్ తోనూ సంబంధాలు ఏర్పర్చుకున్నవారే. అయినా వారు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టి రాజకీయం నెరప లేదు. వారు ప్రజల్లో ఉంటూనే రాజకీయం చేశారు. ఏది జరిగినా ఓటమిని అంత సులభంగా అంగీకరించే వారు కారు. పట్టుబట్టి మళ్లీ గెలవడానికి సర్వశక్తులు ఒడ్డేవారు. ఆ తెగువ కేసీఆర్‌లో కనిపించడం లేదు. ప్రజలకు అసవరమైతే వారే ఓటేస్తారని భావించే రకంగా కెసిఆర్ ఉంటున్నారు. అందుకే ఆయన పార్టీ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొం టోంది. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడ్డ లక్ష్యాలకు, ఆశయాలకూ దూరం కావడంతో పాటు, కెసిఆర్ నేల విడిచి సాము చేయడం వల్ల పార్టీ ఈ దుస్థితిని ఎదుర్కొంటుందన్నది ముమ్మాటికి నిజం. కవితను బయటకు పంపడం ద్వారా ఓ రకంగా పార్టీకి మరిన్ని సంక్షోభాలు తెచ్చుకున్న ట్లుగానే గుర్తించాలి. అలాగే పార్టీ అవినీతి పాలన చేసిందన్న వాదనకు కవిత వ్యాఖ్యలు బలం చేకూర్చాయి. హరీష్ రావు, సంతోష్‌లపై అవినీతి మరకలు వేసినా అవి నేరుగా కెసిఆర్‌కే తాకాయని గుర్తించాలి. ప్రాంతీయ నాయకులకున్న స్థిరత్వం, లక్ష్యశుద్ధి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేసీఆర్ దగ్గర లేకపోవడం కూడా ఇందుకు కారణంగా చూడాలి. అధికారం వస్తే అనుభవించండ లేకుంటే వదిలేయడం అన్న తార్కిక ధోరణిలో కెసిఆర్ ఉండడం కూడా పార్టీ పతనానికి కారణంగా చూడాలి.

తెలంగాణ ప్రజల్లో, ముఖ్యంగా సామాజికంగా బలహీనవర్గాల్లో ఆకాంక్షలు పెరిగిపోయిన క్రమంలో జయశంకర్, కోదండరాం వంటి అనేక మంది నేతలు నిర్మించిన ఉద్యమం ఆయన రాజకీయంగా బలపడేం దుకు తోడ్పడింది. కానీ దానిని ఆయన గుర్తించలేదు. జయశంకర్ సార్ ఎన్ని అవమానాలు ఎదురైనా ఓర్మితో భరించారు. ఇక కోదండరామ్‌తో పాటు అనేకమంది ఉద్యమకారులను కెసిఆర్ మెడపట్టి గెంటేశారు. అసోంలో అస్సాం గణపరిషత్ కూడా ఇలాగే పతనం అయ్యింది. ప్రాంతీయ పార్టీల్లో వారసులు ఉండడం, తండ్రి తరవాత వారు పెత్తనం చేయడం సహజం. మమతా బెనర్జీకి కూడా మేనల్లుడు వారసుడిలా వెన్నంటి ఉన్నారు. కాని ఆ పార్టీలేవీ వారసుల మూలంగా అంతర్గత సంక్షోభంలో చిక్కుకోలేదు. ములాయం, లాలూప్రసాద్, కరుణానిధి, శిబూ సోరెన్‌ల వారసులే ఆ తర్వాత ముఖ్యమంత్రులయ్యారు. పైగా వారి బంధువులు కూడా పార్టీల్లో, పదవుల్లో కీలక స్థానాలు పోషించారు. జయలలిత ఉన్నప్పుడు నెచ్చెలి శశికళ పెత్తనం చేశారు. కానీ పార్టీని దెబ్బతీయలేదు. కాంగ్రెస్‌లో కూడా రాహుల్, ప్రియాంక ఎంత సన్నిహితంగా, ఎవరి బాధ్యతలు వారు నెరవేరుస్తూ, అధికారం కోసం చెమటోడు-స్తున్నారు. కానీ బీఆర్ఎస్ కుటుంబసభ్యుల వల్ల దెబ్బతింటున్నదని గట్టిగా చెప్పానికి కవిత సస్పెన్షన్ కారణంగా చూడాలి. కేసీఆర్ పార్టీని గాలికి వదిలేయడం, ప్రజల్లోకి రాకపోవడం, చుట్కోటరీల ప్రభావానికి లోను కావడం వల్ల కవితను దూరం చేసుకోవడంతో పాటు, ఇంటిగుట్టును రోడ్డున పడేసుకున్నారు. కెసిఆర్ అప్రమత్తంగా, జాగ్రత్తగా లేకపోవడం వల్ల, సరైన మార్గదర్శకత్వం అందించపోవడం వల్ల, ఎవరి పాత్ర ఏంటన్నది నిర్దేశించకపోవడం వల్ల ఇప్పుడు కోలుకోలేని దెబ్బతిన్నారనే చెప్పాలి. కెసిఆర్ విషయాన్ని గ్రహించరు...ఎవరైనా ఏమైనా చెబితే అర్థం చేసుకోరు.

దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలనని ఆశించిన కెసిఆర్ అలా ప్రచారం చేసుకున్న తీరు కూడా ఆయనలోని నాయకత్వ లోపాన్ని ఎత్తి చూపింది. ఫాంహౌజ్‌లో ఉంటూ పూర్తిగా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం సాధ్యం కాదని తెలుసుకోలేదు. ఇంటిని చక్కదిద్దుకోలేక ఇప్పుడు ప్రజల్లో అభాసు పాలయ్యారు. ఇంటిగుట్టును బయటపెట్టుకున్నారు. కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల్లో అవినీతిపై విచారణ జరుగుతున్న వేళ దానిని ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలం కావడం కూడా కెసిఆర్ నాయకత్వ లోపానికి నిదర్శనంగా చూడాలి. అలాగే తన చుట్టూ రాజకీయంగా ఆలోచనలు చేసి చెప్పే అనుభవజ్ఞులను దూరం చేసుకున్నారు. కేవలం అధికారం, డబ్బు సంపాదన మత్తులో తెలంగాణను ఆగం చేసిన పార్టీగా బిఆర్ఎస్ మిగిలిపోయింది. త్వరలో అంతర్ధానం అయినా ఆశ్చర్యం లేదు.

# కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్

- ప్రజలకు దమ్మిడి మేలు చేసేది కాదు
- కాంగ్రెస్‌పై మరోమారు కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప, ఇచ్చే బ్యాచ్ కాదని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఊకంటి ప్రభాకర్ రావుతో పాటు 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడి లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవు. చిత్తశుద్ధి గల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తుంది తప్ప, సాకులు వెతకదు. ఈ సన్నాసులకు ప్రభుత్వం నడపడం చేతకాదు. ఎంతసేపూ ఢిల్లీకి మూటలు పంపడం, పదవులు కాపాడుకోవాలనే సోయి తప్ప ఇంకొటీలేదు. చివరకు కేసీఆర్‌ను తిట్టాలి, అదే వారి పని అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్‌లో తెలంగాణలో అప్పులు ఎంత అని ప్రశ్నించాడు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు, వదిలిపెట్టిపోయిన అప్పు మొత్తం మూడున్నర లక్షల కోట్లు అని కేంద్రం చెప్పింది. అందులో కేసీఆర్ రాకముందు అప్పు 72 వేల కోట్లు. ఆయన వచ్చిన తర్వాత 2 లక్షల 80 వేల కోట్ల అప్పు చేశారని కేంద్రం స్పష్టం చేసింది. అయినా కాంగ్రెస్ నేతలకు సిగ్గులేదు. ఒకడు ఆరు లక్షలు అంటాడు, ఇంకొకడు ఏడు లక్షలు అంటాడు, ఇంకొకడు ఎనిమిది లక్షలు అంటాడు. నోటికి వచ్చినట్టు మాట్లాడతారు. ఆధారం అడిగితే లేదంటారు. ఉపన్యాసాలు అదరగొట్టాలి, మీడియా మేనేజ్‌మెంట్ చేసుకోవాలి ఇదే కాంగ్రెస్ నేతల పని. వారి దృష్టికి రాకుండా డైవర్షన్ గేమ్ ఆడుతున్నారు. కాళేశ్వరం, ఫార్ములా రేస్, విద్యుత్ అంశాల మీద దృష్టి మళ్లించే ప్రయత్నం తప్ప, ప్రజలకు పనికొచ్చే పని చేయలేదు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

### కాంగ్రెస్‌కి ఓటేసి మోసపోయామని రైతులు బాధపడుతున్నారు

పంచాయతీ ఎన్నికలు అయినా, ఢిల్లీ ఎన్నికలు అయినా ఎగరాల్సింది గులాబీ జెండానే. కేసీఆర్ నాయకత్వంలో ముందుకు పోవాలి. చిన్నచిన్న సమస్యలు ఉంటాయి, వాటిని పక్కన పెట్టాలి. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి. ప్రజలు ఈ రోజు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. ఎందుకంటే మన మధ్యన ఒక పెద్దాయన ఉన్నప్పుడు ఆయన విలువ తెలియదు. ఆయన ఆ పదవిలో లేనప్పుడు తెలుస్తుంది. ఎప్పుడైనా చీకటిని చూసినప్పుడే వెలుగు విలువ తెలుస్తుంది. గాడిదను చూసినప్పుడే గుర్రం విలువ తెలుస్తుంది. ఈ రోజు గాడిదలు ఎవరో ఉన్నారని ప్రజలు చూసిన తర్వాత కేసీఆర్ విలువ స్పష్టంగా తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయామని రైతులు బాధపడుతున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తామన్నారు. చివరకు ఇనుము కూడా ఇవ్వరు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప, ఇచ్చే బ్యాచ్ కాదు. ఇది దండుపాళ్యం బ్యాచ్. బంగారం ఇచ్చే బ్యాచ్ అసలే కాదు. ఒక్కొక్క వర్గాన్ని చైతన్యవంతం చేసి గెలుపు దిశగా పయనించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# నా ఆరోగ్యం బాగానే ఉంది

- పుకార్లను నమ్మకండి..
- మీడియా ముందు ప్రత్యక్షమైన ట్రంప్



**న్యూయార్క్, సెప్టెంబర్ 3 :** ట్రంప్ ఆరోగ్యంగా లేరని, అమెరికా మాజీ అధ్యక్షుడు అనారోగ్యంతో ఉన్నారన్న వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. కొద్దిరోజులుగా ట్రంప్ బహిరంగంగా కనిపించకపోవడం వల్ల తీవ్ర సందేహాలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. పైగా, ఆయన కుడి చేతిపై గాయాల్లా కనిపించడం ఈ అనుమానాలను మరింత పెంచింది. వీటన్నింటిపై తాజాగా ట్రంప్ స్పందించారు. ఓవల్ ఆఫీసులో మీడియా ముందు ప్రత్యక్షమైన ఆయన, ఈ ప్రచారాలన్నింటిని "ఫేక్ న్యూస్"గా కొట్టిపారేశారు. చాలా రోజుల తర్వాత మంగళవారం ట్రంప్‌ను మీడియా ఎదుర్కొనగా, ఆయన ఆరోగ్యంపై ప్రశ్నలు సంధించారు. "మీరు చనిపోయారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. వాటి గురించి మీకు తెలుసా?" అని ఒక రిపోర్టర్ అడిగాడు. దీనికి ట్రంప్ స్పందిస్తూ, "అవునా? నేను చనిపోయానని వార్తలొచ్చాయా? నాకు తెలీదు," అంటూ వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. "అవన్నీ వట్టి పుకార్లే. మీరు గుర్తించారుగా!" అని అన్నారు. "ఈ వీకెండ్‌లో నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను. వర్జీనియాలోని గోల్ఫ్ క్లబ్‌లో గోల్ఫ్ ఆడాను. అంతేకాకుండా 'ట్రూత్' సోషల్‌లో శనివారం నుంచి సోమవారం వరకు 90కి పైగా పోస్టులు చేశాను" అని వివరించారు. రెండు రోజుల పాటు తాను ఎలాంటి పోస్టులు చేయకపోవడంతో ఇలాంటి వదంతులు వచ్చాయని అన్నారు. "గత వారం నేను చాలా ప్రెస్ మీటింగ్స్ చేశాను. అవన్నీ విజయవంతంగా జరిగాయి. ఆ తర్వాత రెండు రోజుల పాటు పోస్టులు చేయకపోవడంతో ఏదో జరిగిందని అనుకున్నారు," అని చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్ మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌ను కూడా ప్రస్తావించారు. "బైడెన్ అయితే నెలల తరబడి పబ్లిక్ మీటింగ్స్ చేయకుండా ఉండేవాడు. అయినా ఎవరూ ఆయన ఆరోగ్యం గురించి ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదు. కానీ ఆయన ఆరోగ్య పరిస్థితి అంత గొప్పగా లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ఆరోగ్యంపై వైట్‌హౌస్ వైద్యులు ఇప్పటికే వివరణ ఇచ్చారు. ట్రంప్ చేతిపై కనిపించిన మచ్చలు ఆయన తీసుకుంటున్న ఆస్పిరిన్ మందు వల్ల వచ్చాయని తెలిపారు. హ్యాండ్‌షేక్‌లు ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆ మచ్చలు ఏర్పడతాయని, అవి త్వరలో మాయం అవుతాయని అన్నారు. ఇక 'క్రానిక్ వెనస్ ఇన్‌సఫిషియెన్సీ' కారణంగా ఆయనకు కాళ్ల వాపు వచ్చిందని, ప్రస్తుతం అది కూడా తగ్గిందని వైద్యులు పేర్కొన్నారు.

# కేసీఆర్‌కు కూతురు కన్నా పార్టీయే ముఖ్యం

### మాజీ మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్య



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** కేసీఆర్‌కు కూతురుకన్నా, పార్టీ ముఖ్యమని, అందుకే సస్పెండ్ చేశారని భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై ఆ పార్టీ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి స్పందించారు. పార్టీని ధిక్కరించిన ఆమెపై వేటు- వేయడం సరైన నిర్ణయమేనని చెప్పారు. బోయిన్‌పల్లిలో శ్రీవెంకటేశ్వర లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గణనాథుడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు కుమార్తె, కుమారుడు ముఖ్యం కాదు.. ఆయనకు పార్టీయే ముఖ్యం. దేశవ్యాప్తంగా ఇలాంటి సస్పెన్షన్లు ప్రతి పార్టీలో జరిగాయి. ప్రతి కుటుంబంలో గొడవలు సహజం. తెలంగాణ ప్రజలే కేసీఆర్‌కు ముఖ్యం. తన కుమార్తె, కుమారుడి కోసం పార్టీని ఆయన నాశనం చేసుకోలేరు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో సీబీఐ మాత్రమే కాదు.. ఎవరూ ఏమీ చేయలేరు. సీబీఐ పేరుతో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనుకోవడం సరికాదు. ఆయనలాంటి గొప్ప వ్యక్తి తెలంగాణ నాయకుడిగా ఉండటం మనందరి అదృష్టం. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ డ్రామాలు చేస్తోందని మల్లారెడ్డి విమర్శించారు.

# భగ్గుమంటున్న బంగారం ధరలు

### లక్షా పదివేల దిశగా పరుగులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 :** బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. గత 10 రోజులుగా పెరుగుతూ వస్తున్న గోల్డ్ రేట్స్.. ఎప్పుడూ లేని విధంగా కొత్త గరిష్ఠాన్ని తాకాయి. బుధవారం బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,06,970గా.. 22 క్యారెట్ల ధర రూ.98,050గా ట్రేడ్ అవుతోంది. ఈరోజు 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.880.. 22 క్యారెట్ బంగారం రూ.800 పెరిగింది. ఈ 10 రోజుల్లోనే ఏకంగా 5 వేలకు పైగా పెరగడం విశేషం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బంగారం లక్షా పది వేల రూపాయల చేరువకు వచ్చేసింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,06,970గా.. 22 క్యారెట్ల ధర రూ.98,050గా కొనసాగుతోంది. విశాఖ, విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.1,07,120గా.. 22 క్యారెట్ ధర రూ.98,200గా ట్రేడ్ అవుతోంది. ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు కంగారుపడి పోతున్నారు. ఇక దీపావళి నాటికి బంగారం ధరలు ఎలా ఉంటాయో అని -టె-న్షన్ పడుతున్నారు. మరోవైపు వెండి ధర కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. గత ఐదు రోజులుగా వెండి పెడుతోంది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై ఈరోజు రూ.900 పెరిగి.. రూ.1,27,000గా నమోదైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి లక్షా 37 వేలుగా ఉంది. బుధవారం ఉదయం 10 గంటల వరకు గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్లో నమోదైన గోల్డ్, సిల్వర్ ధరలు ఇవి. ప్రాంతాల వారీగా ధరల్లో మార్పులు ఉంటాయన్న విషయం తెలిసిందే.



# ప్రియుడి మోజులో కట్టుకున్న భర్త హత్య

- తరవాత కూతురును కడతేర్చిన రాకాసి
- పోలీసుల విచారణతో గట్టురట్టు

**భూపాలపల్లి, సెప్టెంబర్ 3 :** ప్రియుడి మోజులో పడి భర్త, కూతురిని కసాయి తల్లి హత్య చేసి అడ్డంగా దొరికిపోయింది. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో జరిగింది. తొలుత భర్తను చంపి తప్పించుకుంది. అయితే కూతురుకు తెలుస్తుందనే ఉద్దేశ్యంతో ఆమెను కూడా మట్టుబెట్టాలని చేసిన ప్లాన్ బెడిసి కొట్టింది. ఈ క్రమంలో కూతురును చంపి అడవిలో కూతురు మృతదేహం పడేసి చుట్టూ క్షుద్రపూజలు చేసినట్లు- నమ్మించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డితల గ్రామంలో కవిత అనే మహిళ తన భర్త, కూతురు వర్షిణితో కలిసి ఉంటుంది. భర్త పక్షవాతంతో బాధపడుతుండగా అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో వివాహేతర సంబంధం పెట్టు-కుంది. ఈ వివాహేతర సంబంధం గురించి తెలుస్తుందని భర్తను జూన్ 25న చంపి వ్యాధితో చనిపోయాడని నమ్మించి అంత్యక్రియలు చేసింది. వివాహేతర సంబంధం విషయం కూతురికి కూడా ఎలాగైనా తెలుస్తుందని ప్రియుడితో కలిసి వర్షిణి(22)ని కసాయి తల్లి కూడా కడతేర్చింది. కూతురు మృతదేహాన్ని భూపాలపల్లి - కాటారం జాతీయ రహదారికి పక్కన అడవిలో పడేసింది. అనంతరం మృతదేహం చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చల్లి ఆధార్ కార్డు పెట్టి నరబలిలా నమ్మించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహం వద్దకు చేరుకొని కవితను అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో ప్రశ్నించడంతో నిజాలు ఒప్పకుంది. 2 నెలల క్రితం ప్రియుడితో కలిసి భర్తను, ఇప్పుడు కూతురిని హత్య చేసినట్లు- ఒప్పుకుంది. మరో హత్య కోసం కూడా ప్లాన్ చేసినట్టు- సమాచారం. దీంతో ప్రియుడు, కవితను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# 6న హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం

### హాజరవుతున్న హోంమంత్రి అమిత్ షా



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా రానున్నారు. మోజంజాహి మార్కెట్ వద్ద గణేశ్ విగ్రహాలకు స్వాగతం పలికి ప్రసంగిస్తారు. ఆరోజు మధ్యాహ్నం 1:10కి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో భేటీ-కానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 నుంచి 3:30 వరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 46 ఏళ్ల ప్రయాణంపై ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర హోంమంత్రి ప్రారంభించి.. కమిటీ- సభ్యులతో గ్రూప్ ఫోటో దిగనున్నారు. 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్-ఎస్‌బీ 28వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని భాజపా వర్గాలు తెలిపాయి.

### 6న సెలవు ప్రకటన

గణేశ్ నిమజ్జనం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 6న శనివారం సెలవు ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సెలవు ఇస్తున్నట్లు- తెలిపింది. అక్టోబర్ 11న రెండో శనివారం పనిదినంగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 6న హైదరాబాద్‌లో జరగనున్న నిమజ్జనానికి జీహెచ్ఎంసీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు- చేస్తోంది. ఆరోజున సుమారు 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గణేష్ నిమజ్జనానికి పోలీస్ శాఖ తరుపున అన్ని ఏర్పాట్లు- చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. నగరవ్యాప్తంగా దాదాపు 3 వేల మంది పోలీసులను మోహరించామని, అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనం జరగబోతుందని చెప్పారు. ప్రతి సంవత్సరం లాగే ఖైరతాబాద్ బడా గణపతిని 6వ తేదీ ఉదయాన్నే టస్కర్ ఎక్కిస్తారని, శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి ఏర్పాట్లు- చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ఐడెంటిఫై చేసి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు.



# కెపిహెచ్ బిలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

## కాలనీలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించిన అభిమానులు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 3, (జనం వార్త) :** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని కెపిహెచ్ బి కాలనీ లో జనసేన నాయకులు, అభిమానులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కూకట్ పల్లి జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథి హాజరై అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులు, జనసేన నాయకులు బాణాసంచా కాల్చారు. అనంతరం కాలనీ లో పెద్ద ఎత్తున నిర్వహించిన బైక్ ర్యాలీని ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ను నిర్వాహకులు శాలువా కప్పి పుష్పగుచ్చలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని జనసేన నాయకులు, వీరమహిళలు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పట్నం మహేందర్ రెడ్డి, శేరి సతీష్ రెడ్డి

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 3, (జనం వార్త) :** వినాయక నవరాత్రి ఉత్సవాలను యువత శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలంగాణ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని అల్లాపూర్ డివిజన్ లో మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపానికి రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీఅధ్యక్షులు శేరిసతీష్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కెపిహెచ్ బి డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్, కూకట్ పల్లి ఏఎంసి డైరెక్టర్ ఫణి,కొమ్ము బాబు,రామక్రిష్ణ రెడ్డి, శ్రీధర్ చారి, గిరి నాయుడు, దాసర్ల గణేష్,మహిళా నాయకురాళ్లు రేష్మ, దార్ల వనజ, వాణీ, ప్రణతి,యమునా,దివ్య, భాగ్య, సరోజ, తదితరులు పాల్గొన్నారు.



# విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బాలానగర్ సిఐ

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 3 (జనం వార్త) :** బాలానగర్ హెచ్ఎల్ టౌన్ షిప్ లో హెచ్ఎఎల్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి బాలానగర్ సీఐ నర్సింహా రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి వినాయకుడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ మోహనరావు, డీజీమ్ హెచ్.ఆర్ సూరకుమార్ రౌట్, సీఎం హెచ్.ఆర్ ప్రహ్లాద్, కామ్ మెంబెర్స్, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్, కర్క నాగరాజు,పరిశ్రమ కార్మికులు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముప్పు శ్రీనివాస్ రెడ్డిని కలిసిన సూర్య నగర్ కమిటీ సభ్యులు

**నాగారం,సెప్టెంబర్ 3 (జనం వార్త) :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఎంటి సూర్య నగర్ కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులు కాలనీ అధ్యక్షులు రోడ్ల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు హెచ్ఎంటి సూర్య నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను ముప్పు శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీజేఎస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎంటి సూర్య నగర్ కాలనీ జనరల్ సెక్రెటరీ కోట రామి నాయుడు, జాయింట్ సెక్రెటరీ పిట్టల రాజు,షేక్ గౌస్,కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పేదలగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం

## పేదోళ్ల గుండెల్లో ఇందిరమ్మ స్థానం సంపాదించుకున్నారు



**కొత్తగూడెం, సెప్టెంబర్ 3:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహనిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామ రెడ్డి, మెహబూబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, అశ్వ రావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, పినపాక శాసన సభ్యులు పాయం వేంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య,కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా రాగామయి తదితరులు ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ముందుగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు బచ్చల నరసమ్మ, రమణల గృహాలను ప్రారంభించి వారితో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం సభలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి స్వంత గృహం కల్పించేందుకు ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరయ్యాయని, అందులో 2 లక్షల 5 వేల 297 ఇండ్ల నిర్మాణం వేగవంతంగా కొనసాగుతోందని వివరించారు.ఇప్పటికే 1 లక్ష 5 వేల లబ్ధిదారుల ఖాతాలలో నేరుగా ఇందిరమ్మ ఇండ్ల ఆర్థిక సహాయాన్ని జమ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు మొత్తం రూ. 5 లక్షలు నాలుగు విడతల్లో మంజూరు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.గతంలో వైఎస్ఆర్ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గృహాలు మంజూరైన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ తర్వాత పది సంవత్సరాల పాటు ఆగిపోయిన ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు కల్పించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కోసం సన్నబియ్యం పంపిణీ పథకం తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

### చిరుజల్లులు దేవుని ఆశీర్వాదం

నూతన గృహప్రవేశాల సందర్భంగా గ్రామంలో అడుగుపెట్టగానే చిరుజల్లులు కురవడం దేవుని ఆశీర్వాదాలుగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. బెండలపాడు గ్రామానికి మొత్తం 312 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దామచర్ల బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా చైతన్యానికి మారుపేరు ఇది ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సమావేశం కాదు..పేదల గూడెంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం సందర్భంగా ఏర్పాటు చేసుకున్న సభ .ఆనాడు పేదవాడి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఇందిరాగాంధీ రోటీ, కప్డా ఔర్ మకాన్ నినాదం తీసుకున్నారు వైఎస్ హయాంలో పేదోడి సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారు. పదేళ్లలో 25 లక్షల ఇండ్లు ఇచ్చిన ఘనత ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానిది.. హనుమాండ్ల గుడి లేని గూడెం, గ్రామం ఉందేమో కానీ ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవు ఎన్నికల సమయంలో ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చాం ఇందిరమ్మ రాజ్యంలో ఆ హామీని నెరవేరుస్తున్నాం పేదోడి సొంతింటి కల నెరవేర్చాలని గృహ నిర్మాణ శాఖ బాధ్యత పొంగులేటి శ్రీనన్నకు ఇచ్చాం సరిగ్గా పని చేసే మంత్రి ఉండాలని ఆయనకు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలు అప్పగించాం నా అంచనా తప్పలేదు.ఆయన శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు ధరణిని బొందపెట్టి భూభారతిని తెచ్చినా పేదోడి సొంతింటి కలను నిజం చేసినా సమర్థవంతంగా చేశారు పేదోడి సొంతింటి కలను నిజం చేయడంకంటే సంతోషం మాకు ఇంకేం ఉంటుంది పేదరికం మాకు ఎక్స్ కర్షన్ కాదు.. అది మా జీవన విధానం పేదరికాన్ని పారద్రోలడమే మా ప్రభుత్వ లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షం పేదోళ్ల గుండెల్లో ఇందిరమ్మ స్థానం సంపాదించుకున్నారు. రేషన్ కార్డులు ఇచ్చాం.. రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం లక్ష కోట్లు దోచుకున్నాయన కుటుంబ సభ్యులు ఒకరికొకరు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు బావ, బామ్మర్ది, అన్న చెల్లి ఇంటిల్లిపాది ఎవరికి వారు కత్తులు బల్లాలు తీసుకుని వీపులో పొడుచుకుంటున్నారు ఎంత సంపాదిస్తే ఏం లాభం.. దోపిడీకి సొమ్ము వాళ్ల కుటుంబంలో చిచ్చు పెట్టింది ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు..

### వాళ్లు వాళ్లు కొట్టుకుని మన పేర్లు తీసుకున్నరు

మేమేదో వాళ్ల వెనక, వీళ్ల వెనక ఉన్నామని అంటున్నారు 2023 లోనే ఆ కాల నాగును కట్టెతో కొట్టి చంపేశా..ఇప్పుడు ఆ చచ్చిన పామును చంపాల్సిన అవసరం నాకుందా? బీఆరెస్ అనే కాలకూట విషం ఉన్న కాలనాగును ప్రజలు డిసెంబర్ 3, 2023 న బండరాయితో మోది బొంద పెట్టారు.మీ పంపకాల్లో పంచాయతీ వస్తే కుటుంబ పెద్ద దగ్గరకు వెళ్లండి తెగకపోతే కులపెద్ద దగ్గరికి పోండి అక్కడ కూడా తెగకపోతే మంత్రగాడి దగ్గరకు పోండి అంతే తప్ప మీ కుటుంబ పంచాయతీలో మమ్మల్ని లాగకండి మాకు రేషన్ కార్డులు ఇచ్చే పని ఉంది.. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే పని ఉంది.. సన్న బియ్యం ఇచ్చే పని ఉంది. మన తలరాతను మార్చేది విద్య ఒక్కటే.. విద్య మాత్రమే మన జీవితాలను బాగుచేస్తుంది 20 వేల కోట్లు పాఠశాలల నిర్మాణానికి ఖర్చు చేస్తున్నాం 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం ప్రతీ నియోజకవర్గంలో ఒక ఏటీసీ ఏర్పాటు చేసే బాధ్యత నాది చదువుకోండి.. చదువుకు ఏం కావాలో నన్ను అడగండి ఎవరో సాయం చేయాలని ఎదురుచూసే స్థాయి నుంచి ఒకరికి సహాయం చేసే స్థాయికి ఎదగాలి ఆ స్థాయికి ఎదగాలంటే చదువుకోవాలి కీలక శాఖలన్నీ ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయి ఖమ్మం జిల్లా ప్రాధాన్యత ఎప్పుడూ తగ్గదు పదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఉంటుంది.. పేదోడి సొంతింటి కలను నిజం చేస్తుంది అని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటిడిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాహుల్, ట్రైనింగ్ కలెక్టర్ సౌరభ్ శర్మ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి లబ్ధిదారులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

# రాష్ట్రాల నష్టాన్ని మాత్రం భర్తీ చేయాల్సిందే

## జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో భట్టి విక్రమార్క

**న్యూఢిల్లీ :** జీఎస్‌టీ శ్లాబుల హేతుబద్ధీకరణను తాము స్వాగతిస్తున్నామని.. అయితే, దీని వల్ల తెలంగాణతోపాటు మిగిలిన రాష్ట్రాలకు ఏర్పడే ఆదాయ నష్టాన్ని ఐదేళ్లపాటు పూర్తిగా కేంద్రమే భర్తీచేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో బుధవారం ఇక్కడ జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. “జీతాలు, పింఛన్లు, అప్పుల చెల్లింపులకే రాష్ట్ర ఆదాయంలో 50% పోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రాల ఆదాయం ఏమాత్రం తగ్గినా అది విద్య, వైద్యం, సంక్షేమం లాంటి అత్యవసర సేవలపై ప్రభావం చూపే ముప్పు పొంచి ఉంది. అదే జరిగితే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులపాలవుతారు. మౌలిక వసతుల ప్రాజెక్టులకు నిధులు లేక రాష్ట్ర అభివృద్ధి తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. జీఎస్‌టీకి ముందు.. రాష్ట్రాల అవసరాలకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించి ఆ మేరకు ఆదాయ వనరులు సమీకరించుకొనే వెసులుబాటు ఉండేది. కానీ, ప్రస్తుతం రాష్ట్రాలకు ఆ వెసులుబాటు లేదు.



# తెలుగు రాష్ట్రాలకు కొత్త రైళ్లు ఇవ్వండి

## స్టేషన్లలో సౌకర్యాలు పెంచండి
## ద.మ. రైల్వే జీఎంను కోరిన ఎంపీలు

**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు కొత్త రైళ్లు కావాలని ద.మ. రైల్వే జీఎంను ఎంపీలు కోరారు. జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ(జడ్ఆర్‌యూసీసీ) 76వ సమావేశం బుధవారం రైలు నిలయంలో జరిగింది. ఎంపీలు ఈటల రాజేందర్ (మల్కాజిగిరి), డీకే అరుణ (మహబూబ్‌నగర్), మాగుంట శ్రీనివాసులురెడ్డి (ఒంగోలు), హరీశ్ బాలయోగి (అమలాపురం)తో పాటు 22 మంది జడ్ఆర్‌యూసీసీ సభ్యులు ద.మ. రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, డిప్యూటీ జీఎం ఉదయ్‌నాథ్ కోట్లతో సమావేశమయ్యారు. రైల్వే స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్ల సంఖ్య పెంచాలని.. పలు స్టేషన్లలో రైళ్లకు హాల్ట్‌లు ఇవ్వాలని వారు కోరారు. ద.మ. రైల్వే జోన్ పరిధిలో 4,655 రూట్ కిలోమీటర్ల మార్గానికి స్వదేశీ పరిజ్ఞానంతో ఆటోమెటిక్ రైలు రక్షణ వ్యవస్థ- కవచ్ తాజా వర్షన్ 4.0 మంజూరైందని జీఎం తెలిపారు. ‘కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ, విజయవాడ-గూడూరు మార్గాల్లో మూడో లైన్ నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. నిర్మాణంలో ఉన్న మార్గాలు మినహా జోన్‌లోని రైలు మార్గాలు 100 శాతం విద్యుదీకరణ పూర్తయ్యాయి. 78 స్టేషన్లలో సీసీటీవీలు ఏర్పాటు చేశాం. మరో 453 స్టేషన్లలో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి’ అని ఆయన వివరించారు.

# గణనాధుని దర్శించుకున్న కౌకుట్ల కుటుంబ సభ్యులు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన కౌకుట్ల లలితమ్మ





**నాగారం,సెప్టెంబర్ 3 (జనం వార్త) :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ప్రతిష్టించిన వినాయక స్వామిని బుధవారం యువజన నాయకులు కౌకుట్ల రాహుల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. లంబోదరుని ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలని విగ్నేశ్వర ఇన్ ఫ్రా డెవలపర్స్ కౌకుట్ల ప్రభాకర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌకుట్ల లలితమ్మ, కౌకుట్ల భూమిక, కౌకుట్ల అర్చన, కౌకుట్ల విదున్ సాయి రెడ్డి, కాలనీవాసులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించిన సాయిబాబా చౌదరి

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 3, (జనం వార్త) :** వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కెపిహెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో స్థానికులు ఏర్పాటుచేసిన వినాయక మండపాలను కేపీహెచ్ బి కాలనీ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి సందర్శించారు. వినాయక ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు మండపాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సాయిబాబా చౌదరి కి శాలువా కప్పి, పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు.







## ఈనెల 8న జిల్లాలోని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు

# ముట్టడికి మాల మహానాడు పిలుపు

- రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం.
- రోస్టర్ పాయింట్ 22 నుండి 16కు తగ్గించాలని డిమాండ్.
- జీవో నెంబర్ 99ను తక్షణమే సవరించాలి.
- ఎస్సీ వర్గీకరణ జివో 99 పాపంలో అందరి ఎమ్మెల్యే ల భాగస్వామ్యం
- మాల మహానాడు జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం.

**మేడ్చల్,సెప్టెంబర్ 3(జనం వార్త) :** ఘట్కేసర్ పట్టణ కేంద్రంలో జాతీయ మాల మహానాడు మున్సిపల్ అధ్యక్షులు ఎజ్జల రఘు, మండల ప్రధాన కార్యదర్శి గుమ్మడి మురళి ఆధ్వర్యంలో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని బుధవారం సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం, ఉపాధ్యక్షులు పడిగం ఆంజనేయులు హాజరైనారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాలలపట్ల సవతి తల్లి ప్రేమ చూపి అణిచి వేస్తున్న తీరు జీవో 99 తీసుకువచ్చి మాల విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ జీవో 99లో అందరి ఎమ్మెల్యే ల భాగస్వామ్యం ఉన్నందున జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ పిలుపుమేరకు ఈనెల 8న జిల్లాలోని అన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను మాల మహానాడు ఆధ్వర్యంలో ముట్టడి చేయాలని పిలుపునిచ్చారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జీవో 99 వెనక్కి తీసుకోవాలని రోస్టర్ పాయింట్లు 22 నుంచి 16 పాయింట్ కు తగ్గించాలని, జీవోను 99 ను సవరించాలని డిమాండ్ చేశారు. దళితుల మధ్య వర్గీకరణ చేసి తీరని అన్యాయం చేస్తున్నారని భవిష్యత్తులో ఉపసంహరించుకోకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడితోపాటు అనేక కార్యక్రమాలు రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పడిగం ప్రవీణ్,టి. రాములు, గుమ్మడి రాము, ఈసామ్ మధు, పర్నాటి సాయికిరణ్, గుమ్మడి అనిల్,ఎస్ బద్రి, మంతూరీ గోపి తదితరులు పాల్గొన్నారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..



## ఆ ఉత్పత్తులపై అమెరికా భారీ సుంకాలు

### సవాల్ చేసిన భారత్

**న్యూఢిల్లీ :** అమెరికా సుంకాల వేళ భారత్ ప్రపంచ వాణిజ్యసంస్థను ఆశ్రయించింది. కొన్ని కాపర్ ఉత్పత్తులపై వేసిన సుంకాలను సవాల్ చేసింది. ఆ టారిఫ్‌లను రక్షణాత్మక చర్యలుగా పేర్కొన్న భారత్.. నిబంధనల ప్రకారం యూఎస్ వాటి గురించి నోటిఫై చేయలేదని వెల్లడించింది. ఆగస్టు ఒకటి నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న పైపులు, వైర్లు, రాడ్లు, షీట్లు, ట్యూబుల వంటి సెమీ ఫినిష్డ్ కాపర్ పరికరాలపై 50 శాతం అమెరికా సుంకం విధించింది. దేశ భద్రతా ఆందోళనల దృష్ట్యా వాటిని విధిస్తున్నట్లు తెలిపింది. వాటివల్ల భారత్ ఎగుమతిదారులపై ప్రభావం పడుతోంది. ఈ క్రమంలో టారిఫ్‌లపై సంప్రదింపులు జరగాలని డబ్ల్యూటీఓలో మన దేశం కోరిందని ఒక నోటిఫికేషన్ ద్వారా వెల్లడైంది. ఈ అభ్యర్థనపై అమెరికా నుంచి సత్వరం సమాధానం వస్తుందని ఎదురుచూస్తున్నట్లు పేర్కొంది. ఈ సంప్రదింపులు ప్రారంభమైన 30 రోజుల్లో ఇరువర్గాల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరకపోతే.. సంస్థ నిబంధనల ప్రకారం భారత్ ప్రతీకార సుంకాలు విధించడానికి వీలు ఉంటుంది. ఇదిలాఉంటే.. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ట్రంప్ సుంకాల మోత మోగించిన సంగతి తెలిసిందే. భారత్ ఎగుమతులపై 50శాతం భారం పడుతోంది. అయితే కాపర్ ఉత్పత్తులపై విధించిన టారిఫ్‌లు ఇందులో భాగం కాదు.



## థాంక్యూ కిమ్..

### యుద్ధంలో సాయానికి పుతిన్ ధన్యవాదాలు..

**బీజింగ్ :** ఉక్రెయిన్ ఆక్రమించుకొన్న క్రస్క్ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు ఉత్తరకొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ చేసిన సాయానికి రష్యా అధినేత పుతిన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ యుద్ధంలో మాస్కో సేనలకు అండగా.. ఉత్తరకొరియా నుంచి కూడా ప్రత్యేక దళాలు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా బీజింగ్‌లో ప్రత్యేక పరేడ్ ఏర్పాటుచేసింది. దీనికి పుతిన్, కిమ్ హాజరయ్యారు. ఈసందర్భంగా వీరిద్దరి మధ్య ప్రత్యేక భేటీ జరిగింది. దీనిలో కిమ్ సాయాన్ని రష్యా అధినేత అభినందించారు. ఇరువురు నేతలు కలిసి ఒకే కారులో ప్రయాణించారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. రష్యాలోని దాదాపు 2 లక్షల జనాభా ఉన్న క్రస్క్ ప్రాంతాన్ని గతేడాది ఉక్రెయిన్ దళాలు ఆక్రమించాయి. దీంతో అక్కడి ప్రజలు నగరాన్ని వీడారు. కొన్ని నెలల తరువాత ఉత్తర కొరియా దళాల సాయంతో రష్యా ఈ ప్రాంతంలో చాలా భాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకొంది. కిమ్ దాదాపు 11,000 మంది సైనికులను ఇక్కడికి పంపారు. ఈ ఏడాది జనవరిలో ఇద్దరు సైనికులను ఉక్రెయిన్ దళాలు బంధించాయి.



## శాంతి కావాలా.. యుద్ధమా

### జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు

**బీజింగ్ :** అమెరికా సుంకాల బెదిరింపుల వేళ.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం ముందు రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని అన్నారు. శాంతా–యుద్ధమా, చర్చలా–ఘర్షణా.. ఏం కావాలో తేల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన ఏర్పాటుచేసింది. ఈక్రమంలో తొలిసారి అధునాతన యుద్ధ విమానాలు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ సామగ్రిని ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి 26 దేశాల నేతలు హాజరయ్యారు. ప్రతిష్ఠాత్మక తియానన్మేన్ స్క్వేర్ ఇందుకు వేదికైంది. దీనిని ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. జిన్‌పింగ్‌తో పాటు ఇందులో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా నాయకుడు కిమ్‌జోంగ్ ఉన్ గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఈ ముగ్గురు యూఎస్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. రెండో ప్రపంచయుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికన్ సైనికుల త్యాగాలను గుర్తించాలన్నారు. యుద్ధం నేపథ్యంలో చైనాకు మద్దతిచ్చి, ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ్ గుర్తిస్తారా..? లేదా..? అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ అన్నారు. ఈ తరుణంలో జిన్‌పింగ్ నుంచి స్పందన వచ్చింది. దేశం సైనిక సామర్థ్యాలను మరింత పెంచుతామని ఈసందర్భంగా చైనా అధ్యక్షుడు ప్రతిజ్ఞ చేశారు. దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని రక్షించడంలో సైనికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈసందర్భంగా తైవాన్‌ను పరోక్షంగా ప్రస్తావించారు. అది తమ దేశంలో భాగమని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తోంది. ప్రస్తుతం అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇక, ఈ కార్యక్రమంలో చైనాలో భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్ హాజరయ్యారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు పాల్గొన్నారు.

# పాక్‌కు నిద్ర కరవు..

## భారత్ మరిన్ని ఎస్-400ల కొనుగోళ్లు..?



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌లో ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ పాక్ వెన్నులో వణుకు పుట్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాయాదికి కంటిమీద కునుకులేకుండా చేసే మరో విషయం బయటకు వచ్చింది. భారత్ అదనపు ఎస్-400 వ్యవస్థల కొనుగోళ్లకు రష్యాతో చర్చలు జరుపుతున్నట్లు రక్షణ రంగ నిపుణులు చెప్పారని ఆ దేశ అధికారిక న్యూస్ టాస్ కథనం వెలువరించింది. ఇటీవల రష్యా మిలిటరీ టెక్నికల్ కోఆపరేషన్ అధిపతి షుగయేవ్ మాట్లాడుతూ భారత్ ఇప్పటికే ఎస్-400లను వాడుతోందని.. కొత్త డెలివరీలపై చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల రష్యా విదేశాంగ మంత్రి సెర్గీలవ్రోవ్ మాట్లాడుతూ మాస్కో నుంచి ఆయుధాలు కొనుగోలు చేయకూడదంటూ అమెరికా తెస్తున్న ఒత్తిడికి భారత్ ఏమాత్రం తలొగ్గదని తాము భావిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో తాము భారత్‌ను అభినందిస్తున్నామన్నారు. స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ప్రకారం 2020-24 మధ్యలో భారత్‌కు అత్యధికంగా 36శాతం ఆయుధాలు రష్యా నుంచే వచ్చాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికా ఉన్నాయి. రష్యా ఆయుధాలైన టీ-90 ట్యాంక్‌లు, సుఖోయ్-30 ఎంకేఐ భారత్‌లోనే లైసెన్స్‌డ్ ప్రొడక్షన్ చేస్తున్నారు. ఇక మాస్కో నుంచి మిగ్-29 ఫైటర్ జెట్‌లు, కమోవ్ హెలికాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రమాదిత్యా (అడ్మిరల్ గోర్ష్‌కోవ్) భారత్ అందుకొంది. ఇక ఏకే-203 రైఫిల్స్, బ్రహ్మోస్ క్షిపణులను భారత్‌లోనే తయారుచేస్తున్నారు. ఇక ఆపరేషన్ సిందూర్ వేళ ఎస్-400 ప్రపంచరికార్డు సృష్టించింది. ఓ విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల అవతల నుంచే ధ్వంసం చేసినట్లు అధికారులు ప్రకటించారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఉపరితలంపై నుంచి గగనతల లక్ష్యాన్ని ఛేదించలేదు. అంతకుముందు కూల్చిన లక్ష్యాల్లో 200 కిలోమీటర్ల దూరమే అత్యధికం. ఎస్-400 గగనతల వ్యవస్థలో వాడే నాలుగు రకాల క్షిపణుల్లో 40ఎన్6 రేంజి 400 కిలోమీటర్లు. దీనిని ఆపరేషన్ సిందూర్‌లో వాయుసేన పూర్తిస్థాయిలో వాడుకొంది. ఈ వ్యవస్థకు భయపడి పాక్ తమ ఎఫ్-16 ఫైటర్‌జెట్లు, చైనా నుంచి కొనుగోలు చేసిన విమానాలను సుదూర ప్రదేశాలకు తరలించిందంటే అర్థం చేసుకోవచ్చు.

## పాక్, అఫ్గాన్ మైనార్టీలకు కేంద్రం ఊరట

### పౌరసత్వ నిబంధనలు సడలింపు



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి వచ్చి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మైనార్టీలకు కేంద్రం ఊరట కల్పించింది. వివిధ రకాల కారణాలతో డిసెంబరు 31, 2024 తేదీ లోపు భారత్‌కు వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద పాస్‌పోర్టు, ఇతర పత్రాలు లేకపోయినా వారు భారత్‌లో ఉండేందుకు అనుమతిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ఆయా దేశాల నుంచి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు భారత పౌరసత్వం కల్పిస్తామని పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ప్రకారం.. 2014 డిసెంబరు 31 కంటే ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు మాత్రమే భారత పౌరసత్వం కల్పించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. తాజాగా ఈ పౌరసత్వ నిబంధనలకు సడలింపులు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) 2025లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. "అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో మతపరమైన హింసల కారణంగా భయంతో డిసెంబరు 31, 2024 తేదీలోపు భారత్‌ను ఆశ్రయించిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం ఇవ్వడానికి కేంద్రం చర్యలు తీసుకుంటుంది. చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు లేకపోయినా భారత్‌లో నివసించవచ్చు. ఇకపై వారికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోతాయి. దశాబ్దాలతరబడి కాందిశీకుల్లా బతుకుతున్న వారికి గౌరవప్రదమైన జీవితం లభిస్తుంది. దేశంలో ఎక్కడికైనా వారు రాకపోకలు సాగించొచ్చు. ఆస్తులు కొనవచ్చు." అని హోంశాఖ వెల్లడించింది.

## బీజింగ్ పరేడ్‌లో రాకాసి అణు క్షిపణి

### 20,000 కిమీ రేంజి..




**బీజింగ్ :** తన అమ్ముల పొదిలోని అత్యాధునిక భారీ అణు క్షిపణిని ప్రపంచం ముందు ప్రదర్శించింది. దీనిని డీఎఫ్-5సీగా వ్యవహరిస్తున్నట్లు గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. విక్టరీ డే మిలిటరీ పరేడ్‌లో ఈ క్షిపణి ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సరికొత్త మిసైల్ రేంజిలోకి భూగోళం మొత్తం వస్తుంది. అంటే ప్రపంచంలో ఎక్కడున్న లక్ష్యాన్నైనా ఇది ధ్వంసం చేయగలదు. అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించుకొని వెళ్లగలదని చెబుతున్నారు.

- ఈ క్షిపణిని ఒక్క వాహనంపై తీసుకెళ్లడం సాధ్యం కాదు. దీనిని మూడు భాగాలుగా తరలించి.. ఆ తర్వాత అసెంబ్లింగ్ చేసి ప్రయోగిస్తారు. గత డీఎఫ్-5 కన్నా డీఎఫ్-5సీని వేగంగా ప్రయోగానికి సిద్ధం చేయొచ్చని అణ్వాయుధ నిపుణుడు ప్రొఫెసర్ యాంగ్ చెంగ్జిన్ వెల్లడించారు. దీనిని భారీ సిలోస్ (బొరియ) నుంచి కూడా ప్రయోగించవచ్చు.
- ఈ మిసైల్ భూమి మొత్తం ప్రయాణించగలదు. దీని రేంజి 20,000 వేల కిలోమీటర్లకు పైగానే. దీంతో చైనా ప్రతి దాడి సమయంలో శత్రువు ఎక్కడా అందకుండా దాక్కొనే అవకాశమే ఉండదు. శత్రుదేశంలోని భూగర్భ స్థావరాలను కూడా ఛేదించగలదు.
- డీఎఫ్-5సీని ప్రయోగించే విధానం కూడా విభిన్నంగా ఉంటుందని యాంగ్ చెప్పారు.
- ఈ భారీ అణు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి దాడి సమయంలో శబ్దం కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించగలదు. దీంతో ప్రస్తుతం ఉన్న గగనతల రక్షణ వ్యవస్థలకు దీనిని ఎదుర్కోవడానికి అతి తక్కువ సమయం మాత్రమే లభిస్తుంది.
- డీఎఫ్-5సీలో ఎంఐఆర్‌వీ (మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్)ను వాడారు. అంటే ఏకకాలంలో పలు అణు, సంప్రదాయ వార్‌హెడ్‌ల.. గగనతల రక్షణ వ్యవస్థలను మోసగించే డెకాయ్‌లను ఇది మోసుకెళ్లగలదు. వేర్వేరు లక్ష్యాలపై ఏకకాలంలో దాడి చేసేలా 10 వార్ హెడ్‌లను తీసుకెళ్లగలదని అంచనావేస్తున్నారు.
- సాధారణంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణలకు అత్యంత కచ్చితత్వంతో దాడి చేసే సామర్థ్యం ఉండదు. వీటిల్లో ఇంటర్నల్ గైడెన్స్ సిస్టమ్, స్టార్‌లైట్ గైడెన్స్ టెక్నాలజీలను వాడుతుంటారు. కానీ, డీఎఫ్-5సీలో మాత్రం చైనా అభివృద్ధి చేసిన బైడూ నేవిగేషన్ వ్యవస్థ సహా ఇతర టెక్నాలజీలను వాడారు. 20,000 కిలోమీటర్లు ప్రయాణించగలిగినా.. షార్ట్ మిసైల్స్ వలే అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదిస్తుందని చైనా చెబుతోంది.

**తొలిసారి ప్రదర్శించిన ఆయుధాలు..**

- చైనా తొలిసారి ఎల్‌వై-1 లేజర్ వ్యవస్థను ప్రదర్శించింది. దీనిని టక్కుపై అమర్చి పరేడ్‌కు తీసుకొచ్చారు. వీటితోపాటు హైపవర్డ్ మైక్రోవేవ్ వ్యవస్థలను కూడా ప్రదర్శించింది.
- న్యూజనరేషన్ టైప్-100 ట్యాంక్‌లను ప్రదర్శించింది. గతలో టైప్ 99 ట్యాంక్‌ల కన్నా ఇవి అత్యాధునికమైనవని చైనా ప్రభుత్వ మీడియా పేర్కొంది. దీనిని హైలీ ఇంటెలిజెంట్ ట్యాంక్‌గా అభివర్ణించింది. సమన్వయం చేసుకొంటూ దాడులు చేయగలదని వెల్లడించింది.
- డాంగ్‌ఫెంగ్-61 ఖండాంతర క్షిపణిని ప్రదర్శించింది. దీని రేంజి 12,000 కిలోమీటర్లుగా వెల్లడించింది. డీఎఫ్-41కు ఆధునిక వెర్షన్‌గా వెల్లడించింది.
- గగనతలం నుంచి ప్రయోగించే అణు క్షిపణి జేఎల్-1ను ఈ సారి పరేడ్‌లో తొలిసారిగా ప్రపంచం ముందుకు తెచ్చింది. గతంలో జలాంతర్గాముల నుంచి ప్రయోగించే జెఎల్-3ను వినియోగంలోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో చైనా న్యూక్లియర్ ట్రైయాడ్‌ను ఇది బలోపేతం చేసినట్లైంది.
- ఏజేఎక్స్002 భారీ సముద్ర డ్రోన్‌ను ఈ సారి పరేడ్‌కు తీసుకొచ్చింది. సముద్రం లోతుల్లోకి చొచ్చుకొచ్చే ముప్పులను ఎదుర్కోవడానికి వీలుగా దీనిని నిర్మించారు.
- హ-6జే లాంగ్ రేంజి బాంబర్ బీజింగ్ గగనతలంపై ఎగిరింది. దీనిని పీఎల్‌ఏ నేవీ కోసం రూపొందించారు. ఇది వైజే-12 యాంటీ షిప్ మిసైల్స్‌ను ప్రయోగించగలదు.
- కృత్రిమ మేధ సాయంతో దాడిచేసే డ్రోన్లను విక్టరీ డే సందర్భంగా చైనా ప్రదర్శించింది.
- పీఎల్‌ఏ రాకెట్ ఫోర్స్ సరికొత్త డీఎఫ్-26డీ మధ్యశ్రేణి రేంజి బాలిస్టిక్ క్షిపణి తొలిసారిగా ఈ ప్రదర్శనకు వచ్చింది.
- జీజే-11 లాయల్ వింగ్‌మన్, సీజే-1000 హైపర్ సోనిక్ క్షిపణి, హెచ్‌క్యూ-20 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ , హైచ్‌క్యూ-29 యాంటీ బాలిస్టిక్ మిసైల్ సిస్టమ్, హెచ్‌క్యూ-11 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, చైనా హామర్స్‌గా పేరున్న పీహెచ్‌ఎల్-16 వంటి ఆయుధాలున్నాయి.

## ఆ ముగ్గురు కలిసి అమెరికాపై కుట్రలు

### ట్రంప్ ఆరోపణలు



**యూఎస్ :** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా నాయకుడు కిమ్‌జోంగ్ ఉన్‌లపై అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ ముగ్గురు యూఎస్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపిం ఓచారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్ ఆయుధ ప్రదర్శనను నిర్వహిస్తుంది. ఓవైపు ఈ కార్యక్రమం జరుగుతుండగా.. ట్రంప్ విమర్శలు చేయడం గమనార్హం. బుధవారం ట్రూత్ సోషల్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికన్ సైనికుల త్యాగాలను గుర్తించాల న్నారు. యుద్ధం నేపథ్యంలో చైనాకు పెద్దఎత్తున మద్దతిచ్చి, ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ్ గుర్తిస్తారా, లేదా అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ పేర్కొన్నారు. నాడు విజయం కోసం చైనా చేసిన పోరాటంలో చాలామంది యూఎస్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. వారి ధైర్యం, త్యాగాలను జిన్‌పింగ్ గుర్తించి, గౌరవిస్తారని తాను ఆశిస్తున్నానన్నారు. చైనా అధ్యక్షుడికి, ఆ దేశ ప్రజలకు ట్రంప్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కిమ్, పుతిన్‌లకు అభినందనలు చెబుతూనే.. వారు యూఎస్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తియానన్మేన్ స్క్వేర్ వద్ద చైనా ఆయుధ ప్రదర్శన జరుగుతుంది. ఈ కార్యక్రమానికి పుతిన్, కిమ్‌తో సహా దాదాపు 26 దేశాల అగ్రనేతలు హాజరయ్యారు. ఈ క్రమంలో బీజింగ్ తన తొలిసారిగా హైప్రొఫైల్ ఆయుధాలను ప్రదర్శించింది.



## పహల్గాం ఉగ్రదాడి వెనక ఈ దేశాల నుంచి సొమ్ము..

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన లష్కరే ముసుగు సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) కు పలు దేశాల నుంచి నిధులు అందినట్లు తేలింది. ఈ దాడి ఇన్వెస్టిగేషన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వేగవంతం చేసింది. తాజాగా టీఆర్ఎఫ్‌కు ఏ దేశాల నుంచి నిధులు అందాయో అన్న వివరాలను వెల్లడించింది. ఇందుకోసం ఉగ్రమూక చేసిన మొత్తం 463 ఫోన్‌కాల్స్‌ను విశ్లేషించింది. వీటిల్లో ముఖ్యంగా పాకిస్థాన్, మలేసియా, గల్ఫ్ దేశాల నుంచి టీఆర్ఎఫ్‌కు నిధులు అందినట్లు గుర్తించింది. టీఆర్ఎఫ్‌కు మలేసియాకు చెందిన యాసిర్ హయత్ అనే వ్యక్తి రూ.9 లక్షలు అందించాడు. లష్కరేకు చెందిన మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది సాజిద్ మిర్ నెట్‌వర్క్‌కు చెందిన సంస్థలతో అతడు సంబంధాలు పెట్టుకొన్నట్లు గుర్తించారు. దీంతోపాటు వీరి కీలకమైన మొబైల్ డేటా, సోషల్ మీడియా ఛాట్స్, బ్యాంక్ లావాదేవీలు, కాల్ రికార్డులను జాతీయ దర్యాప్తు సంస్థ వెలికితీసింది. ఇటీవల శ్రీనగర్, హంద్వారలో చేసిన దాడుల్లో ఈ కేసు కీలక మలుపు తిరిగింది. ఆ సమయంలో టీఆర్ఎఫ్ విదేశీ నిధులకు సంబంధించిన బలమైన సమాచారంతో కూడిన కీలక పత్రాలు బయటపడ్డాయి. వీటిల్లో ఖాతా నెంబర్లతో సహా సమాచారం ఉంది. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ సమావేశంలో పాక్‌పై చర్యలు తీసుకోవడానికి ఇది కచ్చితంగా ఉపయోగపడుతుంది. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం, మనీ లాండరింగ్ చేసే దేశాల కింద పాక్‌ను పరిశీలించాలని భారత్ డిమాండ్ చేస్తోంది. పహల్గాం దాడి జరిగిన వెంటనే పాక్ ఉగ్రవాదానికి ఆర్థిక తోడ్పాటును అందిస్తోందనడానికి తగిన ఆధారాలను భారత్ సేకరించింది. వీటి ఆధారంగా దానిని ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లోకి నెట్టేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2018లో పాకిస్థాన్‌ను గ్రేలిస్టులో చేర్చారు. దీంతో విదేశీ సాయం, అంతర్జాతీయ సంస్థ నుంచి అప్పులు పుట్టక ఇస్లామాబాద్ దారికి వచ్చింది. కానీ, 2022లో ఎఫ్ఏటీఎఫ్ యాక్షన్ ప్లాన్‌ను అమలుచేసి అది జాబితా నుంచి బయటపడింది.

## మా వస్తువులపై భారత్ సుంకాలు ఎక్కువే : ట్రంప్




**యూఎస్ బీ** సుంకాలతో విరుచుకుపడుతోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ వస్తువులపై ఆయా దేశాలు అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా భారత్ సుంకాలతో తమని చంపేస్తోందంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ వస్తువులపై సుంకాలు ఉండవని దిల్లీ అంగీకరించిందని చెప్పిన ఆయన.. భారత్ వస్తువులపై 50శాతం టారిఫ్‌లు విధించడాన్ని మ-రోసారి సమర్థించుకున్నారు. "మాపై పలు దేశాలు సుంకాలు విధించాయి. చైనా సుంకాలతో చంపేస్తోంది. టారిఫ్‌లతో భారత్ మమ్మల్ని చంపుతోంది. బ్రెజిల్ కూడా భారీ సుంకాలు విధిస్తోంది" అని ట్రంప్ పేర్కొన్నారు. స్కాట్ జెన్నింగ్స్ రేడియో షో ఇంటర్వ్యూ మాట్లాడిన ఆయన.. మరేదేశం అర్థం చేసుకోని విధంగా టారిఫ్‌ల గురించి తాను అర్థం చేసుకున్నానని చెప్పారు. "అందరికంటే ఎక్కువగా సుంకాల గురించి అర్థం చేసుకున్నా. నేను చేపట్టిన చర్యలతోనే ఆయా దేశాలు దిగివస్తున్నాయి. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్. తమ వస్తువులపై సుంకాలు ఉండవని వాళ్లు నాకు చెప్పారు. నేను ఈ చర్యలు తీసుకోకుండా ఉంటే వాళ్లు దిగివచ్చేవారు కాదు. అందుకే సుంకాలు ఉండాలి. ఆర్థికంగా మరింత బలపడతాం" అని ట్రంప్ వెల్లడించారు. అనేక దేశాలపై విధిస్తున్న టారిఫ్‌లు అక్రమమని ఓ ఫెడరల్ అప్పీలు న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ట్రంప్.. ఆ కేసును ఇతర దేశాలు స్పాన్సర్ చేస్తున్నాయని ఆరోపించారు. భారత సుంకాలపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందునే ఈ చర్యలు తీసుకున్నామని చెప్పిన విషయం తెలిసిందే.

# ప్రపంచానికి కెన్యా ప్రకృతి దృశ్యాలు



## రాజమౌళి సినిమాపై ఆ దేశ మంత్రి వ్యాఖ్య



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎస్ఎస్ఎంబి29 (వర్కింగ్ టైటిల్). భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. అదే స్థాయిలో విడుదల చేసేందుకు రాజమౌళి ప్లాన్ చేశారు. కెన్యాలో షూటింగ్ చేస్తున్న సందర్భంగా.. ఆ దేశ మంత్రి ముసాలియా ముదావాదిని మూవీ టీమ్ మర్యాదపూర్వకంగా కలిసింది. భేటీ అనంతరం ముఖ్యాంశాలను సోషల్ మీడియాలో అక్కడి మంత్రి పోస్టు చేశారు. రెండు దశాబ్దాలుగా రాజమౌళి సినీ ఇండస్ట్రీలో కొనసాగుతు న్నారు. చాలా శక్తిమంతమైన కథనాలను, విజువల్స్‌ను, లోతైన సాంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంలో ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారు. తూర్పు ఆఫ్రికా అంతటా పర్యటించిన అనంతరం 120 మందితో కూడిన రాజమౌళి టీమ్ కెన్యాను ఎంచుకుంది. మసాయి మరా మైదానాల నుంచి మొదలు సుందరమైన నైవాషా, ఐకానిక్ అంబోసెలి వంటి ప్రాంతాలు ఆసియాలోనే అతిపెద్ద చలనచిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో భాగం కాబోతున్నాయి. 120 దేశాల్లో ఈ మూవీని విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికిపైనే చేరువయ్యే అవకాశం ఉంది. కెన్యాలో షూటింగ్ చేయడం ఒకమైలురాయిగా నిలిచిపోతుంది. ప్రపంచ వేదికపై మా దేశ అందాలను, ఆతిథ్యాన్ని, సుందర దృశ్యాలను చూపడంలో ఈ సినిమా శక్తిమంతంగా పనిచేయనుంది. ఎస్ఎస్ఎంబీ 29 చిత్రంతో కెన్యా తన చరిత్రను ప్రపంచంతో పంచుకోవడానికి సిద్ధంగా ఉంది. ఈ విషయంలో గర్వంగా ఉంది అని ముసాలియా ముదావాది పేర్కొన్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఈ చిత్రంతో ఆవిష్కరించనున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

## ఆ డైరెక్టర్ నన్ను చాలా ఇబ్బంది పెట్టాడు : అనుపమ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన లేటెస్ట్ హారర్ మూవీ 'కిష్కింధపురి'. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. హారర్ సీన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఇక ఈ ట్రైలర్ ఈవెంట్‌లో అనుపమ పరమేశ్వరన్ డైరెక్టర్‌పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'మీ అందరికి ట్రైలర్ నచ్చింది అనుకుంటున్నాను. నాకు చాలా ఇష్టమైన జానర్ ఇది. చిన్నప్పటి నుంచి కూడా హారర్ ఫిలిమ్స్ అంటే చాలా ఇష్టం. నాకు మూడు సంవత్సరాలు ఉన్నప్పటినుంచే నేను హారర్ ఫిలిమ్స్ చూడటం స్టార్ట్ చేశాను. అలాగే.. మార్నింగ్ లేవగానే నా ముఖం చూసి మా అమ్మ అనేవారు దెయ్యంలా ఉన్నావు అని. అయితే.. ఇన్ని ఇయర్స్‌లో నాకు హారర్ ఫిలిమ్స్‌లో ఆఫర్స్ రాలేదు. నా జుట్టు చూసి కొన్ని స్టోరీస్ వచ్చాయి కానీ.. ఈ సినిమా స్టోరీ డైరెక్టర్ కౌశిక్ వచ్చి చెప్పినప్పుడు నాకు కథ చాలా నచ్చింది. నిజం చెప్పాలంటే చెప్పిన విషయాల్లో నాకు సగం అర్థం కాలేదు కానీ.. ఆ ఫ్లో నచ్చి సినిమా వెంటనే ఓకే చేశాను. అది మీకు ఇప్పుడు అర్థం కాదు.. సినిమా చూశాక అర్థం అవుతుంది. కుదిరితే ఒక డిక్షనరీ తీసుకెళ్లండి. అది మీకు సహాయపడుతుంది. ఇలాంటి ఓ క్యారెక్టర్ నాకు ఇచ్చినందుకు నిజంగా థాంక్యూ. స్క్రిప్ట్‌లో ఏముందో దానికంటే బెటర్‌గా సినిమా తీశారు. కౌశిక్‌తో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. నన్ను ఇంతలా డబ్బింగ్ స్టూడియోలో టార్చర్ చేసిన తెలుగు డైరెక్టర్ మరొకరు లేరు. కానీ ఔట్‌పుట్ మాత్రం సూపర్ వచ్చింది.

## 'కొత్త లోక'.. తక్కువ బడ్జెట్ అంటున్నారు : దుల్కర్ సల్మాన్



మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన తాజా చిత్రం 'కొత్త లోక'. కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ ఫాంటసీ థ్రిల్లర్ మూవీ రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్‌ను బుధవారం నిర్వహించింది. టాలీవుడ్ దర్శకులు నాగ్ అశ్విన్, వెంకీ అట్లూరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. "ఈ సినిమా తక్కువ బడ్జెట్‌తో రూపొందించామని కొందరు అనుకుంటున్నారు. 'కింగ్ ఆఫ్ కొత్త', 'కురుప్' లాంటి చిత్రాలకు అయిన ఖర్చే దీనికీ అయింది. మాకు అది పెద్ద బడ్జెటే. మేం పెట్టిన ఖర్చు తెరపై కనిపిస్తోంది. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ ఆలోచనలు కలిస్తే మంచి అవుట్‌పుట్ వస్తుంది. అలా డామినిక్ అరుణ్, నిమిష్ రవితో 'కొత్త లోక' అద్భుతంగా ఉంది. కల్యాణి నా సోదరిలాంటిది. గత జన్మలో మేం కవలలం అనుకుంటున్నా. ఇద్దరం ఒకేలా ఆలోచిస్తాం. ఈ సినిమా అవకాశం రాగానే తన పాత్ర కోసం కష్టపడటం ప్రారంభించింది" అని ప్రశంసించారు. "మలయాళ నటులంతా బాగా యాక్ట్ చేస్తారు. ఈ సినిమాలోని పాత్రధారులు మంచి వినోదం పంచారు. నస్లేన్, కల్యాణి అద్భుతంగా నటించారు. కల్యాణి ఎక్కడా రాజీపడకుండా యాక్షన్ సీన్స్ చేసింది" అని వెంకీ కొనియాడారు. దుల్కర్‌కు సినిమా అంటే ఇష్టమని, అందుకే లేడీ ఓరియెంటెడ్ మూవీ 'కొత్త లోక'తో నిర్మాతగా సాహసం చేశారని నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. దుల్కర్ హీరోగా తాను తెరకెక్కించిన 'మహానటి' షూటింగ్ రోజులు గుర్తుచేసుకున్నారు. మహిళ పేరు (మహానటి)తో సినిమా చేస్తూ.. అందులో హీరోగా నటించమంటే ఎవరూ అంగీకరించేవారు కాదని, దుల్కర్ చేశారని ప్రశంసించారు. కల్యాణి మాట్లాడుతూ.. "నటిగా నన్ను ఆదరించిన తెలుగు ప్రేక్షకులను ఎప్పటికీ మర్చిపోను. టాలీవుడ్‌లో మళ్లీ నటించాలని ఉంది. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నా" అని చెప్పారు. నాగవంశీ మాట్లాడుతూ.. "కొత్త లోక' టీజర్‌ను ఆ మూవీలో భాగమైన నా స్నేహితుడు పంపించారు. అప్పుడే.. తెలుగులో నేనే విడుదల చేస్తానని చెప్పా. ప్రమోట్ చేసేందుకు మాకు సమయం లేదు. అందుకే తెలుగు ఆడియన్స్ ఎక్కువ మంది చూడలేదు. సాంకేతికంగా ఉన్నతమైన చిత్రమిదని తెలియజేసేందుకే ఈ ఈవెంట్ పెట్టాం" అని అన్నారు.

## వస్తాను.. ఎలా అన్నది చెప్పను

### మంత్రి నిమ్మల కూతురు పెళ్లికి ఆహ్వానంపై బాలకృష్ణ

త్వరలో ఏపీలో మంత్రి, పాలకొల్లు శాసన సభ్యుడు నిమ్మల రామనాయుడు కుమార్తె వివాహం జరగనుంది. ఈ క్రమంలో ఆయన నందమూరి బాలకృష్ణను వివాహానికి ఆహ్వానించారు. దీంతో ఆయన ఆసక్తికరంగా స్పందించారు. వస్తానని ఎలా వస్తానో చెప్పనని తెలిపారు. ఈ విషయాన్ని రామానాయుడు సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ఈ మేరకు బాలకృష్ణను ఆహ్వానిస్తున్న వీడియో సైతం షేర్ చేశారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలకృష్ణ గారు ను కలిసి పాలకొల్లులో ఈనెల 24వ తేదీన జరగబోయే నా కుమార్తె శ్రీజ వివాహ శుభలేఖ అందజేసి రమ్మని ఆహ్వానించగా వస్తానని ఎలా వస్తానో చెప్పనని తెలిపారు. మరియు ప్రముఖ చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను గారు ను కూడా రమ్మని ఆహ్వానించడం జరిగింది అని రామానాయుడు పేర్కొన్నారు.

## సుదీప్ సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల



కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటిస్తున్న 47వ చిత్రానికి మార్క్ టైటిల్ ఖరారు చేశారు. సినిమా టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. మార్క్ చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలింస్, కిచ్చా క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సెంథిల్, త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భారీ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు విజయ్ కార్తికేయా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మార్క్ సినిమా ఈ క్రిస్మస్ పండగకు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మార్క్ సినిమా టైటిల్ గ్లింప్స్ పవర్ ఫుల్ గా ఉండి ఆకట్టుకుంటోంది. మ్యాడ్, ఆటిట్యూడ్, రూత్ లెస్, కింగ్...అంటూ మార్క్ పేరులోని అక్షరాలకు డెఫనేషన్ ఇచ్చారు. ఈ గ్లింప్స్ లో అజయ్ మార్కండేయ పాత్రలో కిచ్చా సుదీప్ ను ఇంటెన్స్ లుక్ లో పరిచయం చేశారు. ఆయన క్యారెక్టర్ పేరుతోనే టైటిల్ మార్క్ ఉండబోతోంది. ఈ గ్లింప్స్ కు అజనీష్ లోకనాథ్ అందించిన బీజీఎం ఆకర్షణగా నిలుస్తోంది. కిచ్చా సుదీప్ కెరీర్ లో బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న మార్క్ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.



## గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో నిశాంఛి

బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం నిశాంఛి జార్ పిక్చర్స్ బ్యానర్‌పై అజయ్ రాయ్, రంజన్ సింగ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ఆయిశ్వర్య థాకరే హీరోగా బాలీవుడ్‌కి పరిచయం అవుతుండగా, వేదిక పింటో, మోనికా పన్వార్, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, కుముద్ మిశ్రా కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది.

## అనుకున్న సన్నివేశాలు మిస్ అయ్యాం

### హరిహరవీరమల్లుపై దర్శకుడు క్రిష్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పాన్‌ఇండియా సినిమాగా వచ్చిన హరి హర వీర మల్లు బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా కలెక్షన్లను రాబట్టలేక పోయింది. కేవలం కలెక్షన్స్ పరంగా మాత్రమే కాకుండా కంటెంట్ కూడా ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం రీచ్ కాలేదని టాక్. ఈ సినిమాకు మొదట దర్శకుడిగా ఉన్న క్రిష్ జాగర్లమూడి సినిమా మధ్యలో తప్పుకోవడంతో, తర్వాత సినిమా దర్శక బాధ్యతలు జ్యోతి కృష్ణకి చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా ఘాటి సినిమా ప్రమోషన్స్ సందర్భంగా దర్శకుడు క్రిష్ హరి హర వీర మల్లులోని కొన్ని కీలక విషయాలను బయటపెట్టాడు. ఆయన చెప్పినదాని ప్రకారం.. తాను తెరకెక్కించిన ఎక్కువ సన్నివేశాలు ఢిల్లీ దర్బార్ నేపథ్యంలోనే జరుగుతాయి. అందుకోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకంగా ఒక అద్భుతమైన సెట్ వేసి వాటిని తీశాం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఒక ఛాండెలియర్‌పై జరిగే ఫైట్ సీక్వెన్స్ లో అద్భుతంగా యాక్ట్ చేశారు. కానీ, ఈ ఎపిసోడ్ కథ ఢిల్లీకి వెళ్లిన తర్వాత వస్తుంది. ఇందుకు సంబంధించి దాదాపు 40 నిమిషాల ఫుటేజ్ సెకండ్ పార్ట్ కోసం ఉంచామని తెలిపారు.అలాగే పవన్ కళ్యాణ్ స్వయంగా ఫైట్స్‌లో పాల్గొని అద్భుతంగా పని చేశారన్నారు. ఆయన ఔరంగజేబ్ దర్బార్‌కి వెళ్లి సూటిగా సవాల్ చేస్తారని, మొఘల్ చక్రవర్తి కోసం ప్రత్యేకంగా చేసిన సింహాసనంపై కూర్చొని, అక్కడి నుండి కోహినూర్ వజ్రం దొంగిలించే సన్నివేశం ఉందంటూ సినిమా విశేషాలను రివీల్ చేశారు. ఇలాంటి ఎన్నో మంచి సన్నివేశాల ఫుటేజ్ ఇంకా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉందని ఆయన అన్నారు. నేను పవన్ కళ్యాణ్ పై నా ప్రేమను ఈ సినిమాతో చూపించాను అని క్రిష్ వెల్లడించారు.



## మళ్లీ నటించాలనే ఉంది

### గోవా బ్యూటీ ఇలియానా

గోవా బ్యూటీ ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయ-ంబోతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి... ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు. అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# చాట్‌జీపీటీ డౌన్.. వేల సంఖ్యలో ఫిర్యాదులు




ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీలో సాంకేతిక లోపం వల్ల సేవలకు అంతరాయం కలిగింది. ఈ చాట్‌బా ట్‌ను ఓపెన్ చేస్తుంటే తమకు సమస్యలు ఎదురవుతున్నట్లు భారత్ సహా పలు దేశాల యూజర్లు ఫిర్యాదులు చేశారని డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ పేర్కొంది. చాట్‌జీపీటీ ఆగిపోవడంతో తమ పనులు ఆగిపోయా యంటూ కొంతమంది ఆందోళన వ్యక్తం చేశారు. "చాట్‌జీపీటీ డౌన్ అయ్యిందా అని చూసేందుకు అంతా ఎక్స్ వైపు పరుగులు" అంటూ మరికొందరు మీమ్స్‌తో సందడి చేశారు. గతంలోనూ పలు సంద ర్భాల్లో చాట్‌జీపీటీ సేవలకు అంతరాయం కలిగింది. గతేడాది డిసెం బర్ 12న ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు ఎర్రర్ మెసేజ్‌లు ఎదురవ్వడంతో సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ఓపెన్‌ఏఐ స్పందించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంది. అదే నెల 26న కూడా చాట్‌జీపీటీ సేవలు నిలిచిపోయాయి. ఈ ఏడాది జూన్ 10న చాట్‌జీపీటీ తన చరిత్రలోనే అతి పెద్ద సాంకేతిక సమస్యను ఎదుర్కొంది. సుమారు 12 గంటల పాటు సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో భారత్, అమెరికా వినియోగదారులపై తీవ్ర ప్రభావం కనిపించింది. అయితే దీనిపై ఓపెన్‌ఏఐ ఇంకా పూర్తి సాంకేతిక వివరాలు వెల్లడించలేదు.






## అమెజాన్ ప్రైమ్ సేవల్లో కీలక మార్పు..

ఆన్‌లైన్ షాపింగ్ దిగ్గజ సంస్థ అమెజాన్ ప్రైమ్ సేవల్లో కీలక మార్పులు చేస్తోంది. ఇప్పటి వరకు ప్రైమ్ సభ్యత్వం ఉన్న వారు ఇన్వైటి ప్రోగ్రామ్ కింద ఉచిత షిప్పింగ్‌ను తమ సన్నిహితులు, బంధువులకు షేర్ చేస్తున్నారు. దీనిని ప్రైమ్ ఇన్వైటీ ప్రోగ్రామ్‌గా పిలిచేవారు. అక్టోబర్ 1 నుంచి ఇది ముగియనుంది. ఈ విషయాన్ని వెబ్‌సైట్‌లోని కస్టమర్ సర్వీస్ సెక్షన్‌లో ఉంచింది. సబ్‌స్క్రిప్షన్లను ప్రోత్సహించేందుకు వీలుగానే షేరింగ్ ఆప్షన్‌ను ముగిస్తున్నట్లు అమెజాన్ పేర్కొంది. ఇకపై ప్రైమ్ ఖాతాలో లేని అడ్రస్‌కు డెలివరీలు చేయదు. ఈ విషయాన్ని ఫాక్స్ బిజినెస్ న్యూస్ వెబ్‌సైట్ కూడా ధ్రువీకరించింది. ప్రైమ్ అడ్రస్‌లోనే ఉండే ఇతర కుటుంబ సభ్యులకు మాత్రం డెలివరీలు చేస్తుంది. దీనిని హౌస్‌హోల్డ్ ప్రోగ్రామ్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వీరికి ప్రైమ్ ఈవెంట్లు, డిస్కౌంట్లు లభిస్తాయి. వీడియో యాక్సెస్, రీడింగ్ లైబ్రరీ సదుపాయం కొనసాగిస్తుంది.




## లాభాల్లో దేశీయ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాలతో ముగిశాయి. లోహరంగంలో కొనుగోళ్లు, జీఎస్‌టీ సానుకూల ప్రభావం, అంతర్జాతీయ మార్కెట్ ధోరణి వంటి అంశాలను మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి. సెన్సెక్స్ 409 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 24,700 మార్క్ దాటింది. ఈ ఉదయం 80,295.99 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ మధ్యలో 80,004.60కి పడిపోయింది. ఆ తర్వాత పుంజుకొని ఇన్‌ట్రాడేలో 80,671.28 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 409.83 పాయింట్లు లాభపడి 80,567.71 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 115.35 పాయింట్లు పెరిగి 24,694.95 వద్ద స్థిరపడింది.

## సంతోషం క్షణాల్లో విషాదమైంది

### తొక్కిసలాట ఘటనపై కోహ్లీ భావోద్వేగం



బెంగళూరు తొక్కిసలాట ఘటనపై మరోసారి విరాట్ కోహ్లీ స్పందించాడు. ఇటీవల ఆర్సీబీ కేర్స్‌ను ఫ్రాంచైజీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. మృతిచెందిన బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలను ఆర్థికసాయంగా అందించనుంది. ఇప్పటికే ఆరు పాయింట్లతో కూడిన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఈక్రమంలో విరాట్ కోహ్లీ సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలియజేస్తూ ప్రకటన జారీ చేశాడు. 18 ఏళ్ల తర్వాత కప్‌ను అందుకొన్న సంతోషం క్షణాల్లోనే విషాదంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశాడు. "జూన్ 4న హృదయ విదారక ఘటన జరిగింది. జీవితంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని అనుకోలేదు. మా ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యంత సంతోషకరమైన క్షణం తీవ్ర విషాదంగా మారింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం, గాయపడిన ఫ్యాన్స్ కోసం తీవ్రంగా ఆలోచిస్తున్నాం. వారి కోసం ప్రార్థిస్తున్నాం. మీకు కలిగిన నష్టం ఇప్పుడు మాలో భాగం. ఇక నుంచి మరింత జాగ్రత్తగా, గౌరవంగా, బాధ్యతతో కలసికట్టుగా ముందుకుసాగుతాం" అని కోహ్లీ పోస్టు పెట్టాడు.

## దిగ్వేశ్‌పై బురద చల్లొచ్చు..

### కానీ, నితీశ్ రాణా అలా చేయలేదు: అశ్విన్



దిల్లీ ప్రీమియర్ లీగ్ వివాదాలకు నెలవుగా మారింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సౌత్ దిల్లీ సూపర్‌స్టార్స్, వెస్ట్ దిల్లీ లయన్స్ ఆటగాళ్ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదాలు జరిగాయి. ఒక దశలో కొట్టుకొనేంత వరకూ వెళ్లారు. అందులో నితీశ్ రాణా - దిగ్వేశ్ రాఠీ మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితి నెట్టింట వైరల్‌గా మారింది. ఆ మ్యాచ్‌తో పాటు ఫైనల్‌లోనూ నితీశ్ సారథ్యంలోని వెస్ట్ దిల్లీ లయన్స్ విజేతగా నిలిచింది. అనంతరం దిగ్వేశ్‌తో వాగ్వాదంపై నితీశ్ స్పందించాడు. ఈక్రమంలో నితీశ్‌పై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించాడు. నితీశ్ స్పందించిన తీరు ఆకట్టుకుందని పేర్కొన్నాడు. "మనకిష్టమైన ఆటలో బౌలర్ ప్రవర్తించే తీరును త్వరగా ఇష్టపడం. డీపీఎల్‌లో నితీశ్ - దిగ్వేశ్‌ల మధ్య జరిగిన ఫైట్‌లో తప్పు స్పిన్నర్‌దే అయి ఉండొచ్చు లేదా కాకపోవచ్చు. కానీ, ఆ నెపం మోపే అవకాశం నితీశ్‌కు ఉంది. అయినా సరే నితీశ్ మాత్రం చాలా చక్కగా స్పందించాడు. అతడు ఆ మ్యాచ్‌లో దాదాపు 15 సిక్స్‌లు కొట్టాడు. సెంచరీ బాది తన జట్టును గెలిపించాడు. ఆ తర్వాత ఏమైందనే ప్రశ్న ఎదురైంది. అతడు పరిస్థితిని హ్యాండిల్ చేసిన విధానం సూపర్. ఇక్కడ తప్పు తనదా? దిగ్వేశ్‌దా అనేది సమస్య కాదన్నాడు. తామిద్దరం తమ జట్టు విజయం కోసం ఆడతామని, ఇలాంటప్పుడు పరిస్థితి హాట్‌గా మారడం మ్యాచ్‌కు మంచిదేనన్నాడు. ఇక్కడే అతడిపై నాకు గౌరవం పెరిగింది. దిగ్వేశ్‌పై బురద చల్లే అవకాశం ఉంది. అయినా అతడు అలా చేయలేదు. క్రికెట్ లేదా ఇతర క్రీడల్లో సహచర ప్లేయర్ల క్యారెక్టర్‌ను తక్కువ చేయకూడదు. ఇలాంటప్పుడు నితీశ్ ఏం చెప్పినా సరే నిజమేనని భావిస్తారు. కానీ, అతడు మాత్రం అద్భుతంగా స్పందించి క్రీడా స్ఫూర్తిని నిలిపాడు" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు

# భారీ ఉపశమనం..

## టీమ్ఇండియా ఆటగాళ్లకు బ్రాంకో టెస్టు లేనట్లే




భారత క్రికెటర్లకు అద్భుతమైన న్యూస్. అయితే, ఇది అధికారికంగా కాదు కానీ.. పలు నివేదికల ప్రకారం టీమ్ఇండియా ఆటగాళ్లకు బ్రాంకో టెస్టు నుంచి ఉపశమనం లభించినట్లు వార్తలు వస్తున్నాయి. మొన్నటివరకు యోయో టెస్టుతోపాటు బ్రాంకో టెస్టులోనూ పాస్ కావాల్సిందేనని పట్టుబట్టిన బీసీసీఐ ఇప్పుడు కాస్త వెనకడుగు వేసింది. రగ్బీ ఆటగాళ్ల కోసం అమల్లో ఉన్న ఇలాంటి విధానాన్ని మన క్రికెటర్లకు ఆపాదించడం సరైంది కాదనే విమర్శలూ వచ్చాయి. సీనియర్ ప్లేయర్ రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ఇలాంటి టెస్టును తీసుకొచ్చారంటూ కామెంట్లూ వినిపించాయి. దీంతో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుందని సమాచారం. ఎప్పట్లాగే ఫిట్‌నెస్ టెస్టులను నిర్వహించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. "ఆసియా కప్ కోసం భారత జట్టు నాలుగో తేదీ ఉదయం దుబాయ్‌కు బయల్దేరనుంది. ప్లేయర్లు అందరూ అక్కడే కలుసుకుంటారు. ఐసీసీ అకాడమీలో 5న తొలి ప్రాక్టీస్ సెషన్ జరగనుంది. ఒకవేళ అప్పటికీ మేనేజ్‌మెంట్, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్ బ్రాంకో టెస్టుతోనే ఫిట్‌నెస్ అంచనా వేయాలని భావిస్తే దుబాయ్‌లోనే నిర్వహించే అవకాశం లేకపోలేదు. అయితే, బ్రాంకో టెస్టుపై ఇప్పటికే వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో దాన్ని అమలు చేయకపోవచ్చు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

### మారిపోతూనే ఉంటాయి : సోహమ్ దేశాయ్

ఆటగాళ్ల ఫిట్‌నెస్‌కు సంబంధించి అంచనా వేయడానికి కాలంతో పాటు విధానాలూ మారుతుంటాయని స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ మాజీ కోచ్ సోహమ్ దేశాయ్ వెల్లడించారు. ఈ టెస్టులేవీ జట్టు ఎంపికకు ప్రమాణం కాదని స్పష్టంచేశారు. "విరాట్ కోహ్లీ - రవిశాస్త్రి సమయంలో శంకర్ బసు మార్గదర్శకంలో 2019 వరల్డ్ కప్ కోసం ఫిట్‌నెస్ లెవల్‌ను తీసుకొచ్చారు. అందరి ఆమోదంతోనే అమలు చేశారు. ప్రతిఒక్క క్రికెటర్ ఇదే విధానంలో ఫిట్‌నెస్ నిరూపించుకొని వరల్డ్ కప్‌లో ఆడించారు. ఆ తర్వాత యోయో టెస్టు ఫిట్‌నెస్‌ను అంచనా వేయడానికి విరివిగా వినియోగిస్తున్నారు. ప్రతి సంవత్సరం మూడుసార్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఇది జట్టు సెలక్షన్‌కు ప్రామాణికం కాదు. ఇదంతా ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికే మాత్రమే" అని సోహమ్ తెలిపారు.

# యూఎస్ ఓపెన్ 2025

## తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు యుకీ బాంబ్రీ




భారత టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీ తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. డబుల్స్‌లో తన సహచరుడు మైకెల్ వెనుస్‌తో కలిసి యుకీ యూఎస్ ఓపెన్ బరిలోకి దిగాడు. వీరిద్దరికి 14వ సీడ్ దక్కింది. అయితే, ప్రీ క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ జోడీ కెవిన్ క్రావిట్జ్ - టిమ్ పూయిట్జ్‌పై 6-4, 6-4 తేడాతో యుకీ జోడీ విజయం సాధిం చింది. దాదాపు గంటన్నరపాటు జరిగిన పోరులో పైచేయి సా ధించారు. క్వార్టర్స్‌లో క్రొయేషియాకు చెందిన నికోలా మెక్టిక్ - అమెరికా ప్లేయర్ రాజీవ్‌రామ్‌తో యుకీ - మైకెల్ తలపడనున్నారు.

### ఇప్పటి వరకు..

33 ఏళ్ల యుకీ బాంబ్రీ ఇప్పటివరకు సింగిల్స్‌లో ఒక్కసారి కూడా గ్రాండ్‌స్లామ్‌ల్లో తొలి రౌండ్‌ను కూడా అధిగమించలేదు. కానీ, డబుల్స్‌లో కాస్త ఫర్వాలేదు. ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో మూడో రౌండ్ వరకూ చేరాడు. ఇప్పుడు మొదటిసారిగా క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. నాలుగో సీడ్‌కే షాక్ ఇచ్చిన యుకీ జోడీ క్వార్టర్స్‌లో 11వ జోడీని ఎదుర్కోవడం పెద్ద కష్టమేం కాదు. మరో రెండు మ్యాచుల్లో విజయం సాధిస్తేనే ఫైనల్‌కు చేరుకొనే అవకాశం ఉంది.

### జూనియర్ యూఎస్ ఓపెన్‌లో..

జూనియర్ యూఎస్ ఓపెన్‌లో భారత ప్లేయర్లకు చుక్కెదురైంది. ఈసారి ఆరుగురు బరిలోకి దిగగా.. అందరూ తమ పోరాటాన్ని ముగించారు. అయితే, భారీ అంచనాలు ఉన్న మాయా రాజేశ్వరన్ రేవతి చివరివరకూ పోరాడినా సెకండ్ సీడ్ హన్నా చేతిలో ఓటమి తప్పలేదు. దాదాపు 2 గంటల 2 నిమిషాల పాటు మ్యాచ్ జరిగింది. చివరికి హన్నా 7-6 (1), 4-6, 6-3 తేడాతో మాయాపై గెలిచింది. ఇక బాయ్స్ డబుల్స్‌లో హితేశ్ - క్రిష్ త్యాగి కూడా రెండో రౌండ్‌లోనే వెనుదిరిగారు.

## ఎయిరిండియా స్పెషల్ ఆఫర్..


### రూ.13,300కే ప్రీమియం ఎకానమీ టికెట్లు




ఇటీవలే సీనియర్ సిటిజన్లకు టికెట్లపై డిస్కౌంట్ ప్రకటించిన ప్రముఖ దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా వరుస ఆఫర్లతో ప్రయాణికులను ఆకర్షిస్తోంది. బిజినెస్ క్లాస్, ప్రీమియం ఎకానమీ టికెట్లపై ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. కొన్ని ఎంపిక చేసిన అంతర్జాతీయ మార్గాలకు ఇది వర్తించనుంది. ఈ ఆఫర్‌తో తక్కువ ధరకే విలాసవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నామని సంస్థ వెల్లడించింది. దక్షిణాసియా, పశ్చిమాసియా ప్రాంతాలకు ప్రయాణం చేయాలనుకునే వారి కోసమే ప్రత్యేకంగా ఈ కొత్త ఆఫర్‌ను తీసుకొచ్చారు. ఇందులో ప్రీమియం ఎకానమీ రౌండ్ ట్రిప్ ధర రూ.13,300 నుంచి ప్రారంభమవుతుంది. బిజినెస్ క్లాస్ టికెట్లు రూ.34,400 నుంచి అందుబాటులో ఉండనున్నట్లు సంస్థ తెలిపింది. ఎయిరిండియా అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో బుక్ చేసుకునే వారికి అదనపు రాయితీలు లభిస్తాయని కంపెనీ తెలిపింది. ఇది పరిమితకాల ఆఫర్. సెప్టెంబర్ 2 నుంచి 7 తేదీ వరకు మాత్రమే ఈ డిస్కౌంట్ అందుబాటులో ఉంటుంది. 2026 మార్చి 31 వరకు చేసే ప్రయాణాలకు ఈ ఆఫర్ కింద టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఎయిరిండియా వెబ్‌సైట్, యాప్, ఎయిర్‌పోర్ట్ టికెటింగ్ ఆఫీసులు, కస్టమర్ సర్వీస్ కేంద్రాలతో పాటు ట్రావెల్ ఏజెంట్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అయితే ఆఫర్ చివరి రోజు (సెప్టెంబర్ 7న) మాత్రం కేవలం ఎయిరిండియా వెబ్‌సైట్, యాప్ ద్వారానే టికెట్ బుక్ చేసుకోవాలని కంపెనీ తెలిపింది. ఈ ఆఫర్ కింద టికెట్లు పరిమిత సంఖ్యలో మాత్రమే లభ్యమవుతాయి. మొదట బుక్ చేసుకునే వారికి మొదట ప్రాధాన్యం ఉంటుంది. ఎక్స్ఛేంజ్ రేట్లు, ట్యాక్స్‌ల కారణంగా నగరాల్లో ఛార్జీలు స్వల్ప తేడాతో ఉండొచ్చు. కాబట్టి ఉత్తమ ప్రయోజనాల కోసం ముందుగానే బుక్ చేసుకోవడం మంచిదని ఎయిరిండియా కస్టమర్లకు సూచించింది.

## మోదీ 'దీపావళి గిఫ్ట్' ప్రకటన వేళ..

# ప్రారంభమైన జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్



దీపావళి నాటికి జీఎస్టీ రేట్లు తగ్గించి పండగ ఆనందాన్ని రెట్టింపు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన నేపథ్యంలో.. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం బుధవారం ప్రారంభమైంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈ భేటీ జరుగుతోంది. దిల్లీలో జరుగుతోన్న ఈ సమావేశంలో జీఎస్టీ రేట్ల మార్పులపై నిర్ణయం తీసుకోనున్నారు. గత ఎనిమిదేళ్లలో జీఎస్టీ విషయంలో తమ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని ప్రధాని మోదీ (%ూవీ వీశీుఱ%) ఎర్రకోట వేదికగా చేసిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పేర్కొన్నారు. నిత్యం వాడే ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లు తగిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అది వెలువడిన వెంటనే ఆర్థిక మంత్రిత్వశాఖ జీఎస్టీ గురించి కీలక ప్రకటన చేసింది. జీఎస్టీలో ఇకపై రెండు శ్లాబులే ఉండబోతున్నాయని వెల్లడించింది. కొన్ని ఉత్పత్తులకు మాత్రమే ప్రత్యేక రేట్లు వర్తిస్తాయని తెలిపింది. ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం జీఎస్టీ శ్లాబులు ఉన్నాయి. ఇదిలాఉంటే.. ఈ కౌన్సిల్ మీటింగ్‌కు ముందు ఎన్డీయేతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులు భేటీ అయ్యారు. జీఎస్టీకి సంబంధించి కేంద్రం కీలక చర్యలు చేపడుతోన్న నేపథ్యంలో రాష్ట్రాల ఆదాయం తగ్గకుండా చూడాలని, ఆ మార్పుల వల్ల కలిగే నష్టాన్ని కేంద్రమే భరించాలని ఆ రాష్ట్రాలు కోరాయి. గత వారం ఈ మంత్రుల భేటీలో ఖరారైన అంశాలను తాజాగా మరోసారి చర్చించారు. ఆ ప్రతిపాదనలను కేంద్రానికి అందించనున్నారు. కాగా.. సుమారు 500 ఉత్పత్తులపై కౌన్సిల్ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. జీవిత బీమాపై పన్ను పూర్తిగా ఎత్తివేయనున్నట్లు తెలుస్తోంది. ఈరోజు మధ్యాహ్నం నాటికి ఈ అంశాలపై ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. అలాగే జీఎస్టీ శ్లాబుల్లో సంస్కరణలకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు పూర్తిగా మద్దతు ఇచ్చారని, కౌన్సిల్ భేటీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

## 2.5 బిలియన్ జీమెయిల్ యూజర్లకు

# 'ఎమర్జెన్సీ వార్నింగ్' అవాస్తవం : గూగుల్




2.5 బిలియన్ జీమెయిల్ యూజర్లు అత్యవసరంగా పాస్‌వర్డ్‌లు మార్చుకోవాలని తాము 'ఎమర్జెన్సీ వార్నింగ్' ఇచ్చినట్లుగా వెలువడిన వార్తలు అవాస్తవమని గూగుల్ ఓ ప్రకటనలో పేర్కొంది. జీమెయిల్స్‌కు అత్యంత ప్రభావవంతమైన రక్షణ ఉందని స్పష్టం చేసింది. భద్రతా ఉల్లంఘన జరిగిన ట్లుగా వదంతులు రావడంపై స్పందిస్తూ అందులో ఎంతమాత్రం నిజం లేదని తెలిపింది. 'మేము మా జీమెయిల్ యూజర్లకు భరోసా ఇవ్వాలనుకుంటు న్నాం. జీమెయిల్స్‌కు అత్యంత ప్రభావవంతమైన, బలమైన రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఇటీవల కొన్ని తప్పుదోవ పట్టించే వార్తలు వైరల్ అయ్యాయి. జీమెయిల్‌లో భద్రతా ఉల్లంఘన జరిగిందని, మేము అనేకమంది యూజర్లకు హెచ్చరిక పంపిం చామన్నది వాటి సారాంశం. అవన్నీ తప్పు అని యూజర్లకు తెలియజేస్తున్నాం' అంటూ గూగుల్ బ్లాగ్ ద్వారా వెల్లడించింది. గూగుల్ సేల్స్‌ఫోర్స్ డేటాబేస్ వ్యవస్థలోకి షైనీ హంటర్స్ అనే హ్యాకింగ్ గ్రూప్ చొరబడినట్లు ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ఆ విషయం గూగుల్ దృష్టికి కూడా వెళ్లిందని వదంతులు వ్యాపించాయి. వినియోగదా రులు, వారి కంపెనీ, సాధారణ సమాచారం బయటకు వెళ్లిందని, పాస్‌వర్డ్‌లు మాత్రం హ్యాకర్లకు చిక్కలేదనే వార్తలు చక్కర్లు కొట్టాయి. దీనిపై గూగుల్ స్పందించి హ్యాకింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని కొంతమంది యూజర్లు, సంస్థలకు సూచించినట్లుగా కథనాలు వెలువడ్డాయి. వీటిపై తాజాగా స్పందించిన గూగుల్ తమ వేదికలో చొరబడటానికి హ్యాకర్లు ప్రయత్నించిన విషయం వాస్తవమేనని అంగీకరించింది. కానీ, రక్షణ వ్యవస్థ బలంగా ఉండటం వల్ల ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొంది. ఇన్‌బాక్స్‌లలోకి ప్రవేశించే వారిని 99.9శాతం అడ్డుకుంటున్న ట్లు వెల్లడించింది. యూజర్లు మాల్వేర్‌ల బారిన పడకుండా భద్రత కల్పిస్తున్నామని తెలిపింది. మరింత భద్రత కోసం యూజర్లు మెరుగైన పాస్‌వర్డ్‌లు వినియోగించాలని సూచించిం ది. పాస్‌కీలు వాడుతూ తాము సూచించిన మార్గదర్శకాలు పాటించాలని కోరింది. అప్పుడే చొరబాట్లను సులభంగా గుర్తించగలమని గూగుల్ వ్యాఖ్యానించింది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com